


సిఫీ టెక్నాలజీస్ ఏఐ రెడీ డేటా సెంటర్ ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

'డేటా'లో అగ్రస్థానం


- దేశంలోనే అత్యధిక డేటా సెంటర్లు వున్న రాష్ట్రం: ముఖ్యమంత్రి స్టాలిన్
- సిరుచేరి ఐటీ పార్క్‌లో 'సిఫీ టెక్నాలజీస్' ప్రారంభం
- రూ.1882 కోట్లతో వెయ్యిమందికి ఉపాధి

చెన్నై, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే డేటా సెంటర్లు అధికంగా ఉన్న రాష్ట్రం తమిళనాడేనని, ఇందుకు తమ ప్రభుత్వం 2021లో రూపొందించిన డేటా సెంటర్ల పాలసీయే ప్రధాన కారణమని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తెలిపారు. చెంగల్పట్టు జిల్లా సిరుచేరి ఐటీ పార్కులో సిఫీ టెక్నాలజీస్ సంస్థ ఆధ్వర్యంలో రూ.18882 కోట్ల పెట్టుబడితో వెయ్యి మందికి ఉపాధి కల్పించేలా నిర్మించిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రెడీ డేటా సెంటర్‌ను ముఖ్యమంత్రి స్టాలిన్ గురువారం ఉదయం ప్రారంభించారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు 2030నాటికి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ట్రిలియన్ డాలర్ల స్థాయి సాధించేలా వారికి సమగ్రమైన సమాచారాలను అందించే విధంగా డేటా సెంటర్లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. ఈ కేంద్రం ప్రారంభించిన అనంతరం సీఎం మాట్లాడుతూ.. సిఫీ టెక్నాలజీస్ సంస్థ కంప్యూటర్ సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చినప్పటి నుండి ఇంటర్‌నెట్ సేవలు, డేటా సెంటర్ల ఏర్పాటు, క్లౌడ్, నెట్‌వర్క్ సేవలందిస్తోందని వివరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి టీఆర్బీ రాజా, ఎంపీ సెల్వం, శాసనసభ్యుడు ఎస్ఎస్ బాలాజీ, పారిశ్రామిక పెట్టుబడుల ప్రోత్సాహక వాణిజ్యశాఖ కార్యదర్శి వి.అరుణ్‌రాయ్, మార్గదర్శక సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ థరేస్ అహమ్మద్, చెంగల్పట్టు జిల్లా కలెక్టర్ ఎస్.అరుణ్‌రాజ్, సిఫీ టెక్నాలజీస్ అధ్యక్షులు రాజు వేగెశ్న, సీఈఓ విజయకుమార్, ఆ సంస్థ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మరుదమలైలో 184 అడుగుల మురుగన్ విగ్రహం

- రూ.110 కోట్లతో నిర్మాణం
- అసెంబ్లీలో మంత్రి శేఖర్‌బాబు

చెన్నై, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): వాణిజ్యనగరం కోయంబత్తూరు సమీపంలో ఉన్న సుప్రసిద్ధ శైవ క్షేత్రం మరుదమలై సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వద్ద రూ.110 కోట్లతో 184 అడుగుల మురుగన్ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర హిందూ దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు ప్రకటించారు. శాసనసభలో గురువారం తన శాఖకు చెందిన ఆర్థిక పద్దులకు సంబంధించి ప్రతిపాదనలు ప్రవేశపెట్టిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మరుదమలై అరుళ్‌మిగు సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వద్ద మ్యూజియం, వాహనాల పార్కింగ్ తదితర సదుపాయాలతో షట్కోణాకారంలో ఏర్పాటు చేయనున్న పచ్చికబయలు మధ్య 184 అడుగుల మురుగన్ కాంస్య విగ్రహాన్ని నెలకొల్పుతామని చెప్పారు. రాష్ట్రంలో దైవదర్శనానికి వెళ్లే దివ్యాంగులకు ఆలయాల ఆధ్వర్యంలో నడిపే వాహనాల్లో ఎలాంటి ఛార్జీ వసూలు చేయడం లేదని, వించ్, రోప్ కార్లలోనూ వారి నుండి ఎలాంటి రుసుము వసూలు చేయడం లేదన్నారు. పళని దండాయుధపాణి ఆలయం ఆధ్వర్యంలో నడుపుతున్న కాలేజీ హాస్టల్స్‌లో విద్యార్థులందరికీ మూడుపూటలా ఉచిత భోజన సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. హిందూ దేవాదాయ శాఖ ఆలయాల్లో ఖాళీగా ఉన్న 70 ఓదువార్ల పోస్టులు త్వరలో భర్తీ చేయనున్నామని తెలిపారు. ఆలయాల తరఫున ఈ ఆర్థిక సంవత్సరంలో వెయ్యి మంది యువకులకు రూ.70వేల విలువైన సారె వస్తువులను కానుకగా ఇచ్చి వివాహాలు జరిపించనున్నామని చెప్పారు. తంజావూరు సంస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆలయాల మరమ్మతు, నిర్వహణకు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీని రూ.6కోట్ల నుండి రూ.8 కోట్లకు పెంచినట్లు చెప్పారు.



ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కలిసి 'తిరుచెందూరు ఆలయ చరిత్ర' పుస్తకాన్ని అందజేస్తున్న దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు



మరుదమలై మురుగన్ ఆలయం

సిరుమలైలో తృటిలో తప్పిన ప్రమాదం

- వ్యాన్ బోల్తా, 27 మందికి గాయాలు



ఘాట్‌రోడ్డు పక్కనే బోల్తాపడిన వ్యాన్

చెన్నై, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లా సిరుమలై ఘాట్‌రోడ్డులో వెళుతున్న వ్యాన్ పక్కనే ఉన్న కొండలోతట్టు ప్రాంతంలో బోల్తాపడటంతో గాంధీగ్రామ్ విశ్వవిద్యాలయానికి చెందిన 24 మంది విద్యార్థులు సహా మొత్తం 27 మంది తీవ్రంగా గాయపడ్డారు. గాంధీగ్రామ్ విశ్వవిద్యాలయానికి చెందిన ద్వితీయ సంవత్సరం విద్యార్థులు, సిబ్బంది కలిసి బుధవారం సిరుమలైకి వ్యాన్‌లో వెళ్లారు. అక్కడ అధ్యయనం పూర్తయిన తర్వాత అందరూ వ్యాన్‌లో విశ్వవిద్యాలయానికి బయలుదేరారు. ఆ వ్యాన్ సిరుమలై మూడో మలుపు వద్ద అదుపుతప్పి ఘాట్‌రోడ్డు పక్కనే ఉన్న 50 అడుగుల లోయలోకి బోల్తాకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ నాగరాజ్ (33), విద్యార్థి వినీత్ (19) తీవ్రంగా, 25 మంది స్వల్పంగా గాయపడ్డారు. గాయపడినవారిని చికిత్స నిమిత్తం దిండుగల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న దిండుగల్ ఎంపీ ఆర్.సచ్చిదానందం, కలెక్టర్ శరవణన్, మేయర్ ఇలమది ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు. దిండుగల్ తాలూకా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.



చెన్నై సచివాలయంలో క్రీడాశాఖ నిర్వర్తిస్తున్న ఉపముఖ్యమంత్రి ఉదయనిధిని కలుసుకున్న ఫ్రాన్స్ క్రీడారాయబారి సామ్యూల్ డుక్రోకే

అమ్మాయిగా పుట్టివుంటే కమల్‌ను పెళ్లాడేవాడిని
- శివరాజ్ కుమార్ - 7



మాట్లాడదాం రండి!

- ఢిల్లీ నుంచి గవర్నర్‌కు పిలుపు
- హూటాహూటిన హస్తినకు పయనమైన రవి



అడయార్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి గురువారం ఆకస్మికంగా ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. కేంద్రం నుంచి పిలుపురావడంతో ఆయన హస్తినకు వెళ్లినట్టు తెలిసింది. ఈ పర్యటనలో ఆయన కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో పాటు పలువురు న్యాయ నిపుణులను కలిసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. గురువారం సాయంత్రం 4.30 గంటలకు విమానంలో ఆయన ఢిల్లీ వెళ్లారు. ఆయన వెంట ప్రత్యేక కార్యదర్శితో పాటు భద్రతాధికారులు కూడా ఉన్నారు. మొత్తం నాలుగు రోజుల పాటు గవర్నర్ ఢిల్లీలో వుంటారని రాజ్‌భవన్ వర్గాలు తెలిపాయి. ఈ నెల 20వ తేదీ మధ్యాహ్నం నగరానికి చేరుకోనున్నారు. అయితే, ఆయన నాలుగు రోజుల ఢిల్లీ టూర్ వివరాలను రాజ్‌భవన్ అధికారికంగా వెల్లడించలేదు. కేవలం కేంద్రం నుంచి పిలుపు రావడంతోనే ఆయన హస్తినకు వెళ్లినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. సుదీర్ఘకాలంగా గవర్నర్ పెండింగ్‌లో పెట్టిన ముసాయిదా బిల్లుల్ని సుప్రీంకోర్టు ఆమోదించడంతో పాటు రవికి తలంటుపోసింది. సుప్రీం చేత మొట్టికాయలు తిన్న గవర్నర్‌ను తక్షణమే రీకాల్ చేయాలంటూ వివిధ రాజకీయ పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. అదే సమయంలో ఇటీవల నగరానికి వచ్చిన కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో గవర్నర్ భేటీ అవుతారని అందరూ భావించినా, అది జరగలేదు. దీంతో గవర్నర్ తీరు పట్ల కేంద్రం అసంతృప్తిగా వున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆర్ఎన్ రవి ఢిల్లీ వెళ్లడంతో రాజకీయవర్గాల్లో ఉత్కంఠ రేగుతోంది.

రూ.10వేల కోట్ల పెట్టుబడుల సమీకరణ

- అంతరిక్ష సాంకేతిక పరిశ్రమలపై ప్రత్యేకదృష్టి
- మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం

చెన్నై, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని పారిశ్రామికపరంగా అభివృద్ధి చేసి, రూ.10వేల కోట్ల పెట్టుబడుల సమీకరణే లక్ష్యంగా అంతరిక్ష సాంకేతిక పరిశ్రమల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. సచివాలయంలో గురువారం సాయంత్రం ముఖ్యమంత్రి స్టాలిన్ అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం జరిగింది. సుమారు పది వేలమంది నిరుద్యోగులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పించేలా అంతరిక్ష సాంకేతిక పరిశ్రమల స్థాపనకు, ముఖ్యంగా బహుళ జాతి సంస్థల పరిశ్రమలు నెలకొల్పేందుకు ఆయా సంస్థలకు మరిన్ని రాయితీలు కల్పించాలని కూడా ఈ సమావేశంలో నిర్ణయించారు. అదేవిధంగా వార్షిక బడ్జెట్‌లో ప్రకటించిన కొత్త పథకాల అమలుకు మంత్రి వర్గం ఆమోదం తెలిపినట్లు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీఆర్బీ రాజా తెలిపారు. మంత్రివర్గ సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర అంతరిక్ష పారిశ్రామిక విధానం-2025కు మంత్రి వర్గం ఆమోదం తెలిపిందన్నారు. దీని వలన వచ్చే ఐదేళ్లలో అంతరిక్ష పరిశ్రమల శాఖలో రూ.10 కోట్ల మేర పెట్టుబడులను ఆకర్షించాలని, అదే సమయంలో కనీసంగా 10 వేలమంది నిరుద్యోగ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని మంత్రివర్గం నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ప్రపంచ దేశాలన్నీ ప్రస్తుతం స్పేస్ టెక్‌లో పోటీపడుతూ పరుగులు తీస్తున్నాయని, ఆ రేస్‌లో రాష్ట్రం కూడా పాలుపంచుకునేలా ముఖ్యమంత్రి స్టాలిన్ కొత్త ప్రేరేపణ కలిగించారని చెప్పారు. ఏఐ పుణ్యమా అని అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానంలో విప్లవాత్మకమైన మార్పులు జరుగుతున్నాయని, ఆ దిశలోనే నెలకొల్పిన స్టార్టప్ కంపెనీలకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహాన్ని కూడా అందించాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రులు దురైమురుగన్, ఎం.సుబ్రమణ్యం, పొన్ముడి, పీకే శేఖర్‌బాబు, కేఎన్ నెహ్రూ, తంగం తెన్నరసు, గీతాజీవన్, కేకే ఎస్ఎస్ఆర్ రామచంద్రన్, టీఆర్బీ రాజా, దామో అన్బరసన్, ఈవీ వేలు, అన్బిల్ మహేష్ పొయ్యామొళి, ముత్తుసామి, సామినాదన్, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఎన్. మురుగానందం తదితరులు పాల్గొన్నారు.



మంత్రివర్గ సమావేశంలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

నేడు గుడ్‌ఫ్రైడే

ప్రత్యేక ప్రార్థనలకు ముస్తాబైన చర్చిలు

ప్యారీస్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మానవాళి శ్రేయస్సు కోసం యేసుక్రీస్తు ప్రాణత్యాగం చేసిన ఘట్టాన్ని గుర్తుచేసుకుంటూ క్రైస్తవులు శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా ఉపవాస ప్రార్థనల్లో పాల్గొననున్నారు. శిలువపై ప్రాణత్యాగం చేసిన యేసుక్రీస్తును స్తుతిస్తూ శుభ శుక్రవారం జరుపుకునేందుకు రాష్ట్రవ్యాప్తంగా చర్చిలు ముస్తాబయ్యాయి. నాగపట్నం జిల్లాలో ప్రపంచ ప్రసిద్ధి చెందిన వేళాంకన్ని మేరీమాత ఆలయం, తంజావూరు జిల్లా తిరుతురైపూండిలోని మేరీమాత ఆలయం, బీసెంట్‌నగర్ వేలాంకన్ని చర్చి, మైలాపూర్ శాంథోమ్ చర్చి, ప్యారీస్ సెయింట్ ఆంథోని చర్చి, జెమిని సర్కిల్‌లోని కెథిడ్రల్ చర్చి, ఎగ్మోర్ సేక్రేడ్ హార్ట్ చర్చి, వెపేరి హైరోడ్డులోని మద్రాస్ సెంటినరీ తెలుగు బాప్టిస్టు చర్చి, పెరంబూరు కుక్సురోడ్డులోని వాటర్‌బరి మెమోరిల్ తెలుగు బాప్టిస్ట్ చర్చి, ఆవడిలోని కల్వరి వర్షిప్ సెంటర్, విల్లివాక్కం రక్షణ సైన్యం సంఘం, అయినావరం రైల్వే క్వార్టర్స్‌లోని సాల్వేషన్ ఆర్మీ చర్చి, న్యూమోడల్ లైన్‌లోని సెయింట్ పీటర్ చర్చి, చూలై తెలుగు బాప్టిస్ట్ చర్చి, కాత్పాడ న్యూలేబర్ లైను తెలుగు బాప్టిస్ట్ సంఘం, అంబత్తూరు క్యాథలిక్ చర్చి, కొరుక్కుపేట డాక్టర్ అంబేద్కర్ నగర్ న్యూతెలుగు బాప్టిస్ట్ సంఘం, నరసింహనగర్, ఆంజనేయనగర్, నజరేత్‌పురం, పల్లావరం తదితర ప్రాంతాల్లోని చర్చీల్లో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం వరకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు.



రాష్ట్రంలో సంకీర్ణ ప్రభుత్వానికి తావులేదు

- అన్నాడీఎంకే ఎంపీ తంబిదురై



చెన్నై, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర చరిత్రలో ఇప్పటివరకూ సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు కాలేదని, భవిష్యత్తులోనూ జరగదని అన్నాడీఎంకే ఎంపీ తంబిదురై స్పష్టం చేశారు. గిండిలో స్వాతంత్ర్య సమరయోధుడు ధీరన్ చిన్నమలై విగ్రహం వద్ద పార్టీ తరఫున ఆయన నివాళులర్పించారు. ఆ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... వచ్చే యేడాది జరిగే శాసనసభ ఎన్నికల్లో అన్నాడీఎంకే- బీజేపీకూటమి గెలిస్తే సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటవుతుందా? బీజేపీకి అధికార భాగస్వామ్యం కల్పిస్తారా? అంటూ ఇటీవల పలు వర్గాలు, ప్రత్యర్థుల నుండి అనుమానాలు బయలుదేరుతున్నాయని, అయితే రాష్ట్రంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటుకు తావులేదన్నారు. 1952లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ద్వితీయ స్థానం దక్కిందని, ఆ సమయంలో ఇతర పార్టీల మద్దతుతో కాంగ్రెస్ నేత రాజాజీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినా, మిత్రపక్షాలకు అధికారంలో భాగస్వామ్యం కల్పించలేదన్నారు. కామరాజర్ రెండుసార్లు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారని, అప్పుడు కూడా సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు కాలేదన్నారు. 1977లో ఎంజీఆర్ అధికారంలోకి వచ్చినా సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేదన్నారు. 2006లో డీఎంకేకు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి తగినంత సంఖ్యాబలం లేకపోయినప్పటికీ కాంగ్రెస్ మద్దతుతో ప్రభుత్వం ఏర్పాటైందని, అప్పట్లో కాంగ్రెస్ నాయకుడు ప్రణబ్‌ముఖర్జీ కాంగ్రెస్‌కు మంత్రివర్గంలో స్థానం కల్పించాలని ఒత్తిడి చేసినా మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి పట్టించుకోలేదని, ఆ సమయంలో కాంగ్రెస్‌కు అధికారంలో భాగస్వామ్యం కల్పించలేదని తంబిదురై వివరించారు. ఈ నేపథ్యంలో 2026లో ఎడప్పాడి పళనిస్వామి నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పాటైనా మిత్రపక్షాలకు అధికారంలో భాగస్వామ్యం కల్పించే ప్రసక్తి ఉండదని స్పష్టం చేశారు. ఈ విషయంలో ఎడప్పాడి ఆచితూచి వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు.

వారిద్దరిదే తుది నిర్ణయం...

అన్నాడీఎంకే - బీజేపీ కూటమి గెలిస్తే సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటువుతుందా అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్‌ను విలేఖరులు ప్రశ్నించగా, ఈ విషయంపై అన్నాడీఎంకే నేత ఎడప్పాడి పళనిస్వామి, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా కలిసి చర్చించి తుది నిర్ణయం తీసుకుంటారని బదులిచ్చారు. శాసనసభ ఎన్నికల్లో రాష్ట్రంలో డీఎంకే ప్రభుత్వాన్ని పడగొట్టడమే రెండు పార్టీల ఏకైక లక్ష్యమని, ప్రస్తుతం ఆ దిశగానే రెండు పార్టీలూ కలిసి పనిచేస్తాయని ఆయన చెప్పారు.

సమాచార ధ్వని

నేడు హజ్రత్ నిజాముద్దీన్‌కు ప్రత్యేక రైలు

చెన్నై, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రయాణీకుల రద్దీని దృష్టిలో పెట్టుకుని శుక్రవారం చెన్నై సెంట్రల్ నుంచి హజ్రత్ నిజాముద్దీన్‌కు ప్రత్యేక రైలు (నెంబరు:06071) నడపనున్నట్లు దక్షిణరైల్వే ప్రకటించింది. శుక్రవారం రాత్రి 11.50 గంటలకు చెన్నై సెంట్రల్‌లో బయలుదేరే రైలు ఆదివారం సాయంత్రం 4.50 గంటలకు హజ్రత్ నిజాముద్దీన్ చేరుకుంటుంది. 20 స్లీపర్, 2 సెకండ్ క్లాస్ (దివ్యాంగులకు) బోగీలు కలిగిన ఈ రైలు గూడూరు, ఒంగోలు, విజయవాడ, వరంగల్, బల్హార్షా, నాగ్‌పూర్, ఇటార్సి, బోపాల్, బినా, విరంగన లక్ష్మీబాయ్ ఝాన్సీ, గ్వాలియర్, ఆగ్రా, మధుర స్టేషన్లలో ఆగనుంది. గురువారమే ఈ రైలుకు రిజర్వేషన్ ప్రారంభమైంది.

రేపు ఉపాధ్యాయులకు సెలవు

అడయార్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ప్లస్‌టూ జవాబు పత్రాల మూల్యాంకన విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు శనివారం సెలవు మంజూరు చేశారు. ఉపాధ్యాయుల వినతిని పరిగణనలోకి తీసుకున్న విద్యాశాఖ ఉన్నతాధికారులు సెలవు ప్రకటించారు. రాష్ట్రంలో ప్లస్ వన్, ప్లస్‌టూ పబ్లిక్ పరీక్షల జవాబు పత్రాలను పీజీ గ్రేడ్ టీచర్లు మూల్యాంకనం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 18వ తేదీ గుడ్ ఫ్రైడే, 20వ తేదీన ఈస్టర్ పండుగను క్రైస్తవ సోదరులు జరుపుకోనున్నారు. అయితే, దూర ప్రాంతాలకు వెళ్ళే ఉపాధ్యాయులు 19వ తేదీ జరిగే మూల్యాంకన విధుల్లో పాల్గొంటే వారు తిరిగి సొంతూర్లకు వెళ్ళేందుకు ఇబ్బందులు ఎదురవుతాయి. దీంతో 19వ తేదీ సెలవు ఇవ్వాలని ఉపాధ్యాయులు విజ్ఞప్తి చేశారు. వీరి విన్నపాన్ని పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వ ఉన్నతాధికారులు.. 19వ తేదీ శనివారం సెలవు ప్రకటించారు. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల నిర్వహణ విభాగం డైరెక్టర్ లత ఉత్తర్వులు జారీచేశారు.

జూన్ నుంచి తిరుచ్చి - హైదరాబాద్ విమాన సేవలు

అడయార్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): వచ్చే జూన్ ఒకటో తేదీ నుంచి తిరుచ్చి - హైదరాబాద్ ప్రాంతాల మధ్య విమాన సేవలను ప్రారంభించనున్నట్టు ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సంస్థ వెల్లడించింది. తిరుచ్చి విమానాశ్రయం నుంచి చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాలకు ఇండిగో విమాన సేవలను నడుపుతోంది. మిగిలిన విమాన సర్వీసులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఈ నేపథ్యంలో తిరుచ్చి నుంచి హైదరాబాద్ నగరానికి అదనపు విమాన సర్వీసులను నడపాలని ప్రయాణికులు ఎప్పటి నుంచో కోరుతున్నారు. దీంతో ఎయిర్ ఇండియా ఈ రెండు ప్రాంతాల మధ్య విమాన సేవలను నడిపేందుకు ముందుకు వచ్చింది. జూన్ ఒకటో తేదీ నుంచి ప్రారంభమయ్యే ఈ విమాన సేవలు ప్రతి రోజు ఉదయం 9.45 తిరుచ్చిలో బయలుదేరి, మధ్యాహ్నం 11.30 గంటలకు హైదరాబాద్‌కు చేరుకుంటుంది. అలాగే, హైదరాబాద్‌లో ఉదయం 7.35 గంటలకు బయలుదేరి తిరుచ్చికి 9.15 గంటలకు చేరుకుంటుంది. ఈ రెండు ప్రాంతాల మధ్య విమాన ప్రయాణ చార్జీని రూ.4200గా నిర్ణయించగా, పూర్తి వివరాల కోసం ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ డాట్ కామ్ వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చని ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ ఓ ప్రకటనలో వెల్లడించింది.

నగరంలో 30 కొత్త పార్కులు

ప్యారీస్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరాన్ని సుందరీకరణ పథకంలో భాగంగా మరో 30 కొత్త పార్కులు నిర్మించనున్నట్లు రాష్ట్ర నగర పాలకశాఖా మంత్రి కె.నెహ్రూ ప్రకటించారు. అసెంబ్లీలో గురువారం ఉదయం ప్రశ్నోత్తరాల సమయంలో పలువురు సభ్యులు పార్కుల ఏర్పాటుపై అడిగిన ప్రశ్నలకు మంత్రి నెహ్రూ సమాధానమిస్తూ, నగరంలో ఇప్పటికే 908 పార్కులు, 724 క్రీడామైదానాలు ప్రజలకు అందుబాటులో ఉన్నాయని ప్రస్తుతం 32 కొత్తపార్కుల నిర్మాణం పనులు రూ.8 కోట్ల తో ముమ్మరంగా జరుగుతున్నాయని మంత్రి తెలిపారు. 2025-26వ సంవత్సరంలో రూ.60 కోట్లతో మరో 30 కొత్తపార్కులు నిర్మించనున్నట్లు తెలిపిన మంత్రి, 273 పార్కులను రూ.30 కోట్లతో అభివృద్ధిపరుస్తున్నట్లు వివరించారు.

ప్రభుత్వ శాఖల్లో ఖాళీ పోస్టుల భర్తీ

ప్యారీస్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వ శాఖల్లో ఖాళీ అయిన 1.56 లక్షల పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టినట్లు మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి కయల్‌విలి సెల్వరాజ్ అసెంబ్లీలో ప్రకటించారు. గురువారం అసెంబ్లీలో పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ, ఐఏఎస్ అధికారుల శిక్షణా కేంద్రం ద్వారా ప్రవేశ పరీక్షలు నిర్వహించి, రిజర్వేషన్ కోటాలో 325 మందిని శిక్షణకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని ఈ ప్రభుత్వం ఇప్పటివరకు టీఎన్‌పీఎస్సీ ద్వారా 24,599 పోస్టులకు అలాగే టీచర్ల ఎంపిక బోర్డు ద్వారా 8,666 పోస్టులు, వైద్య ఉద్యోగుల ఎంపిక బోర్డు ద్వారా 4,329 పోస్టులు, తమిళనాడు యూనిఫాం ఎంపిక ద్వారా 19,408 పోస్టులను ఇప్పటికే భర్తీ చేసినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వంలోని పలు శాఖల్లో ఖాళీ అయిన 1.55,992 పోస్టులను కూడా భర్తీ చేసే చర్యలు చేపట్టినట్లు మంత్రి కయల్‌విలి తెలిపారు.

తెరుచుకున్న ద్రౌపది అమ్మన్ ఆలయ తలుపులు

- ఎస్సీలకు తొలి దర్శనం
- హైకోర్టు ఆదేశాలను అమలు చేసిన అధికారులు

అడయార్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మద్రాస్ హైకోర్టు ఆదేశాల మేరకు విల్లుపురం జిల్లా మేల్‌పాది గ్రామంలో ఉన్న ద్రౌపది అమ్మన్ ఆలయాన్ని అధికారులు గురువారం తెరిచారు. ఆ తర్వాత షెడ్యూల్ కులాలకు చెందిన ప్రజలకు తొలి దర్శనం కల్పించారు. ఈ గ్రామంలోని ద్రౌపది అమ్మన్ ఆలయానికి దర్శనంచేసుకునే విషయంలో రెండు వర్గాలకు చెందిన ప్రజలకు ఘర్షణ చెలరేగింది. దీంతో 2023జూన్ 7తేదీ రెవెన్యూ అధికారులు ఆలయానికి తాళంవేశారు. దీంతో ఆలయాన్ని తెరిచి మళ్ళీ పూజలు చేసేందుకు అనుమతివ్వాలని కోరుతూ ఓవర్గానికి చెందిన ప్రజలు మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన హైకోర్టు... 2024 మార్చి 22వ తేదీ ఆలయాన్ని తెరిచి ఏకకాల పూజ చేసేందుకు అనుమతిచ్చింది. ఆ తర్వాత పలుమార్లు ఈ కేసు విచారణతో పాటు గ్రామంలోని ఇరు వర్గాల మధ్య శాంతిచర్చలు జరిగాయి. ఈ నేపథ్యంలో హైకోర్టు ఆదేశాల మేరకు గురువారం ఆలయాన్ని తెరిచి పూజలు చేశారు. ఆ తర్వాత షెడ్యూల్ కులాల ప్రజలు అమ్మవారి దర్శనం చేసుకునేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

అవన్నీ తప్పుడు ఆరోపణలు

కట్నం కోసం కోడలిని వేధించలేదు ● హల్వావ్యాపారి వియ్యంకుడు యువరాజ్



కోవైలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న యువరాజ్ తదితరులు

చెన్నై, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి హల్వా దుకాణం యజమాని కుమార్తెను కట్నం కోసం వేధించినట్లు, ఆ దుకాణాన్ని తమకు రాసివ్వమన్నానే ఆరోపణలన్నీ అవాస్తవాలనీ కోయంబత్తూరుకు చెందిన పారిశ్రామికవేత్త యువరాజ్ స్పష్టం చేశారు. హల్వా దుకాణం యజమాని కవితాసింగ్ తన కుమార్తె శ్రీకనిష్కను ఆమె భర్త బలరామ్‌సింగ్, మామ యువరాజ్ అదనపు కట్నం కోసం చిత్రహింసలు పెట్టారంటూ తిరునల్వేలి పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. ఈ ఆరోపణలను ఖండిస్తూ కవితా సింగ్ వియ్యంకుడు యువరాజ్ కోయంబత్తూరులో మీడియా సమావేశం ఏర్పాటు చేఉశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు తరాలుగా తమ కుటుంబీకులు ఎగుమతుల వ్యాపారం చేస్తున్నారని, తాను ఆధ్యాత్మిక మార్గంలో పయనిస్తున్నానని, తన కుమారుడికి మంచి సంబంధం కోసం వెదుకుతుండగా మూడుసార్లు నిశ్చితార్థం జరిగి చివరిక్షణాల్లో పెళ్ళి ప్రయత్నాలు ఆగిపోయి దైన్యస్థితిలో ఉన్న శ్రీకనిష్కను సానుభూతితో కోడలిగా చేసుకునేందుకు అంగీకరించామని తెలిపారు. కవితాసింగ్ మెకానిక్ కార్ వర్క్‌షాపు నడుపుతుండేవారని, యేడాదికి ముందే తిరునల్వేలి హల్వా దుకాణం కవితా సింగ్‌కు దక్కిందని చెప్పారు. హల్వా దుకాణం భాగస్వాముల సంతకాలు ఫోర్జరీ చేసి కవితాసింగ్ దుకాణాన్ని అపహరించినట్లు తిరునల్వేలి డిప్యూటీ పోలీసు కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదులున్నాయని చెప్పారు. ఆ విషయమై హైకోర్టులో కేసు కూడా నడుస్తోందని చెప్పారు. ఈ వివాదాలకు ముందే పెళ్ళి ప్రయత్నాలు జరిగాయని కట్నకానుకలు తీసుకోకుండా పెళ్ళికి అంగీకరించామని తెలిపారు. ప్రస్తుతం హల్వా దుకాణం పేరుతో రూ.5కోట్ల మేరకు బ్యాంకు రుణం తీసుకుని చెల్లించలేకపోతున్నారని, ఈ నేపథ్యంలోనే తన కోడలు శ్రీకనిష్క తామంతా కలిసి అదనపు కట్నం కోసం వేధించినట్లు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, పెళ్ళి సమయంలో ఓ సూట్‌కేసు నిండుగా నగలతో వచ్చిన కోడలు తన కుమారుడికి మరో యువతితో అక్రమ సంబంధం ఉందని అసత్య ఆరోపణలు చేసి నగలతో ఉన్న సూట్‌కేసును పుట్టింటికి తీసుకెళ్ళిందని ఆరోపించారు. తాను పారిశ్రామికవేత్తగా, న్యాయవాదిగా ఉండటంతో వారి మోసాలకు సంబంధించిన వాస్తవాలు వెలుగులోకి వస్తాయనే భయంతోనే తమ కుటుంబీకులకు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు. హల్వాదుకాణాన్ని తమ పేరుతో రాసిపెట్టమని ఏనాడు తమ కుటుంబీకులు అడగలేదని స్పష్టం చేశారు. సంపాదనలో కవితాసింగ్ కుటుంబీకులకంటే తామే అధికంగా సంపాదిస్తున్నామని, ఆధ్యాత్మికవేత్తగా ఏడు గుడులు కూడా నిర్మించానని తెలిపారు. అప్పులు తీర్చలేని స్థితిలో కవితాసింగ్ ఆమె కుటుంబీకులు కట్నం కోసం వేదిస్తున్నట్లు తప్పుడు ఆరోపణలు చేయడం గర్హనీయమని యువరాజ్ పేర్కొన్నారు.

వీధిలైట్లు ఏర్పాటు చేయరూ...

- అధికారులకు గ్రామస్థుల వినతి

తిరుత్తణి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు మండలం రామచంద్రాపురంలోని తనిగేనగర్ గ్రామంలో వీధిలైట్లు లేకపోవడంతో రాత్రివేళ తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. అర్థరాత్రి సమయంలో పొరుగూరికి వెళ్ళివచ్చే వారికి దారి కనిపించక తరుచు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అధికారులు చర్యలు తీసుకొని వీధిలైట్లను ఏర్పాటుచేయాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు.

ఉదయనిధి మంత్రివర్గంలోనూ దురైమురుగన్‌కు చోటు

- అసెంబ్లీలో నవ్వులు పూయించిన డీఎంకే ఎమ్మెల్యే

ప్యారీస్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రాబోయే రోజుల్లో ప్రస్తుత ఉపముఖ్యమంత్రి ఉదయనిధి నేతృత్వంలో ఏర్పాటు కానున్న మంత్రివర్గంలో సీనియర్ మంత్రి దురైమురుగన్‌కు స్థానం వుంటుందని శీర్గాలి డీఎంకే ఎమ్మెల్యే పన్నీర్‌సెల్వం ప్రస్తావించి అసెంబ్లీలో నవ్వులు పూయించారు. గురువారం ఉదయం అసెంబ్లీలో రోడ్ల విస్తరణ అంశంపై మాట్లాడిన ఎమ్మెల్యే పన్నీర్‌సెల్వం తంజావూరు జిల్లా కొళ్లిడం నదీకుడివైపున గట్టు బలపరుస్తారా? అని ప్రశ్నించగా, ఆ శాఖ మంత్రి దురైమురుగన్ చెప్పిన సమాధానాన్ని ఎమ్మెల్యే స్వాగతించారు. కలైంజర్ కరుణానిధి మంత్రివర్గంలో ఆయన కుమారుడు స్టాలిన్ మంత్రివర్గంలో ప్రజలు మెచ్చుకునే విధంగా పనిచేసిన సీనియర్ మంత్రి దురైమురుగన్ ఉదయనిధి మంత్రివర్గంలో కూడా వుంటారని చమత్కరించడంతో సభ్యులందరు నవ్వుతూ కరతాళధ్వనులతో హర్షంవ్యక్తం చేశారు.

బార్‌లో మహిళలు మద్యం సేవించారా?

ప్యారీస్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఓ బార్‌లో ఈనెల 4వ తేదీ మహిళలు గుంపులుగా కూర్చుని మద్యం సేవిస్తున్నట్లు సోషల్ మీడియాలో హల్చల్ చేసిన వీడియోపై రాష్ట్రప్రభుత్వం వివరణ ఇచ్చింది. రాష్ట్రంలో టాస్మాక్ దుకాణాలకు వ్యతిరేకంగా నారీలోకం పలు రకాల ఉద్యమాలు నిర్వహిస్తున్న వేళలో బార్‌లో మహిళలు మద్యం సేవిస్తున్నట్లు ప్రసారమైన వీడియో పలువురిని దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ నేపథ్యంలో, తమిళనాడు ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్ గురువారం విడుదల చేసిన ప్రకటనలో బార్‌లో మహిళలు మద్యం సేవిస్తున్న వీడియో ఈ రాష్ట్రానికి చెందినది కాదని, తెలంగాణాకు చెందిన సోషల్ మీడియా ఈ వీడియోను విడుదల చేసిందని స్పష్టంచేసింది.

వర్సిటీలను అరివాలయాలుగా మార్చొద్దు

- బీజేపీ నేత తమిళిసై

ప్యారీస్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు న్యాయాన్ని బోధిస్తున్న విశ్వవిద్యాలయాలను డీఎంకే ప్రధాన కార్యాలయమైన అరివాలయాలుగా మార్చరాదని ముఖ్యమంత్రి స్టాలిన్ నుద్దేశించి బీజేపీ సీనియర్ నేత తమిళిసై సౌందరరాజన్ విమర్శించారు. సచివాలయ ప్రాంగణంలో బుధవారం సాయంత్రం రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల ఉపకులపతులు, రిజిస్ట్రార్‌లతో భేటీ అయిన ముఖ్యమంత్రి స్టాలిన్, వారికి డీఎంకే ప్రభుత్వ విధానాలను స్పష్టంచేయడంతో పాటు భవిష్యత్తు ప్రణాళికల్లో భాగంగా దిశా నిర్దేశం చేశారు. ఈ భేటీపై స్పందించిన తమిళిసై ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యావిధానంలోని అంశాలను పూర్తిగా అర్థంచేసుకోకుండా దానిని డీఎంకే ప్రభుత్వం తప్పుబట్టడం సరికాదన్నారు. ప్రపంచస్థాయిలో రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలకు ప్రత్యేక గుర్తుంపు వచ్చే విధంగా నూతన విద్యావిధానం సహకరిస్తుందని అయితే, దీనిని వ్యతిరేకంగా విశ్వవిద్యాలయాలను డీఎంకే ప్రధాన కార్యాలయాలుగా మార్చొదని సీఎం స్టాలిన్ హెచ్చరించారు.

శతాధిక వృద్ధుడికి హైరిస్క్ హిప్ సర్జరీ

ప్యారీస్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): వందేళ్ళు వయస్సున్న ఓ వృద్ధుడికి అరుదైన శస్త్రచికిత్సను తాంబరంలోని బీవెల్ ఆస్పత్రి వైద్యబృందం విజయవంతంగా చేశారు. నగరానికి చెందిన 101సంవత్సరాల వృద్ధుడు న్యూమోనియా, హైగ్రేడ్‌జ్వరం, మూత్రపిండ వైఫల్యం వంటి సమస్యలతో బాధపడుతూ, చికిత్స కోసం బీవెల్ ఆస్పత్రిలో చేరారు. ఆయన వయస్సును దృష్టిలో ఉంచుకున్న అనస్థీషియాలజీ, నెఫ్రాలజీ, కార్డియాలజీ, క్రిటికల్‌కేర్, ఫిజియోథెరపి నిపుణులతో కూడిన వైద్యబృందం హోమియో ఆర్థోప్లాస్టీ అనే ప్రక్రియ ద్వారా ఇంట్రా ఆపరేటివ్ సమస్య లేకుండా శస్త్రచికిత్సను విజయవంతం చేశారని ప్రస్తుతం రోగి ఆరోగ్యంగా ఉన్నారని అస్పత్రి డైరెక్టర్ డాక్టర్ సీజే వెట్రివేల్, సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ గోపినాథ్ దురైస్వామి విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.



వృద్ధుడితో ఆస్పత్రి వైద్యుల బృందం

కరుణ సమాధిపై ఆలయ గోపుర అలంకారం

- మంత్రి శేఖర్‌బాబుపై అన్నామలై ఆగ్రహం



ఆలయరాజగోపురం అలంకారంతో ఉన్న కరుణానిధి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి శేఖర్‌బాబు

చెన్నై, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): శాసనసభలో దేవాదాయ శాఖ ఆర్థిక పద్దులపై ప్రతిపాదన ప్రవేశపెట్టడానికి ముందుగా మెరీనాబీచ్‌లో పూలతో ఆలయగోపుర అలంకారంతో ఉన్న మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి సమాధి వద్ద ఆ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు నివాళులర్పించారు. ఈ సంఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో తీవ్రంగా వైరల్ అయ్యింది. ఈ విషయంపై బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు అన్నామలై మంత్రి శేఖర్‌బాబుపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. నాస్తికవాది అయిన మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి సమాధిపై హిందువులంతా అత్యంత పవిత్రంగా భావించే ఆలయ రాజగోపురం ఆకారంతో పూల అలంకరించి మంత్రి శేఖర్‌బాబు నివాళులర్పించడం గర్హనీయమన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి స్టాలిన్‌కు బానిసలుగా పేరుతెచ్చుకోవడంలో మంత్రులంతా ఒకరికొకరు పోటీపడుతున్నారని, ఆ పోటీలో మంత్రి శేఖర్‌బాబు అందరికంటే ముందున్నట్లు కరుణానిధి సమాధిపై ఆలయ రాజగోపురం ఆకారంతో పూల అలంకారం చేసి తన బానిసత్వాన్ని రుజువుపరచుకున్నారని విమర్శించారు.

మీనాక్షి ఆలయానికి 3 వీల్ చైర్ల విరాళం



వీల్ చైర్లను కానుకగా అందజేస్తున్న అతుల్యా సీనియర్ కేర్ సంస్థ నిర్వాహకులు

చెన్నై, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): వృద్ధులకు రెసిడెన్షియల్ ప్లాట్లను నిర్మించడంలో పేరొందిన అతుల్యా సీనియర్ కేర్ సంస్థ మదురైలోని మీనాక్షి అమ్మవారి ఆలయానికి మూడు వీల్ చైర్‌లను కానుకగా సమర్పించింది. చిత్తిరై ఉత్సవాల సందర్భంగా ఆలయానికి వచ్చే దివ్యాంగుల కోసం ఈ వీల్ చైర్లు అందజేసింది. అతుల్యా సీనియర్ కేర్ సంస్థ నియమించిన సిబ్బంది ప్రతిరోజూ ఉదయం 7 నుండి రాత్రి 8 గంటల వరకు ఆలయానికి వచ్చే దివ్యాంగులను ఈ వీల్‌చైర్లలో ఆలయంలోకి తీసుకెళతారని ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీనివాసన్ తెలిపారు. సంస్థ డైరెక్టర్ కృష్ణ కావ్యా, ఆలయ జాయింట్ కమిషనర్ కృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

'కాబోయే ముఖ్యమంత్రి నయినార్ నాగ్రేందన్'

తిరునల్వేలిలో కలకలం సృష్టిస్తున్న పోస్టర్



కాబోయే ముఖ్యమంత్రి నయినార్ నాగేంద్రన్ అంటూ తిరునల్వేలి గోడలపై అతికించిన పోస్టర్లు

చెన్నై, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది జరుగనున్న శాసనసభ ఎన్నికల్లో గెలిస్తే అన్నాడీఎంకే - బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటవుతుందని, ఆ పార్టీకి అధికారంలో భాగస్వామం కల్పించే ఆస్కారమే లేదని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి చెబుతుండగా, ఎన్నికల ఫలితాల తర్వాత ప్రభుత్వం ఏర్పాటుపై అమిత్‌షా చర్యలు చేపడతారంటూ బీజేపీ రాష్ట్రశాఖ అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ చెబుతున్నారు. ఈ నేపథ్యంలో నయినార్ నాగేంద్రన్ స్వస్థలం తిరునల్వేలిలో పార్టీ శ్రేణులు ఆయనకు ఘనస్వాగతం పలుకుతూ 'కాబోయే ముఖ్యమంత్రి నయినార్ నగేంద్రన్' అంటూ ఆ నగరమంతటా అతికించిన పోస్టర్లు తీవ్ర కలకలం సృష్టిస్తున్నాయి.

చెరువులో పడి వ్యక్తి అనుమానాస్పద మృతి



సుధాకరన్ (ఫైల్‌ఫొటో)

తిరుత్తణి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): తిరుత్తణి పోలీస్‌స్టేషన్ సమీపంలోని చెరువులో పడి ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు తిరుత్తణి - అరక్కోణం హైరోడ్డులోని సుబ్రమణ్యపురం రైల్వే రెసిడెన్షియల్ వీధికి చెందిన సుధాకరన్ (41) తన కుటుంబసభ్యులతో కలిసి ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం తన పిల్లలను పాఠశాలలో వదిలేందుకు వెళ్ళిన సుధాకరన్ తిరిగి ఇంటికి రాలేదు. అనుమానంతో అతని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. గురువారం ఉదయం చెరువులో ఓ వ్యక్తి మృతిచెందాడన్న సమాచారం తెలుసుకున్న ఆ ప్రాంత పోలీసులు, సుధాకరన్ కుటుంబసభ్యులను చెరువు వద్దకు తీసుకురాగా, మృతిచెందింది సుధాకరన్‌గా వారు నిర్ధారించారు. దీనిని అనుమానాస్పద మృతగా కేసునమోదు చేసిన పోలీసులు సుధాకరన్ మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. మద్యం మత్తులో చెరువులోపడి మరణించాడా? లేక ఎవరైన హత్యచేసివుంటారా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

తిరువొత్తియూర్‌లో ఇళ్ల కోసం జాలర్ల ధర్నా



రాస్తారోకోలో పాల్గొన్న జాలర్ల కుటుంబాలు

ప్యారీస్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరువొత్తియూర్ తిరుచినాంకుప్పం బీచ్‌రోడ్డులో రాష్ట్రప్రభుత్వ గృహనిర్మాణ సంస్థ (టీఎన్‌హెచ్‌బీ) నిర్మించిన ఇళ్లను తక్షణమే కేటాయించాలని కోరుతూ గురువారం జాలర్లు ధర్నాకు దిగారు. టీఎన్‌హెచ్‌బీ ఆధ్వర్యంలో తిరుచినాంకుప్పం ప్రాంతంలో ప్రారంభించిన 360 గృహాలతో కూడిన సాముహిక భవనాలు 2023వ సంవత్సరంలోనే పూర్తయ్యాయి. లబ్ధిదారులకు ఇళ్లు అప్పగించే పనులు కూడా ప్రారంభించిన అధికారులు ఇందు కోసం డిపాజిట్‌గా నగదు కూడా వసూలు చేశారు. ఈ నేపథ్యంలో రెండు సంవత్సరాలు గడుస్తున్నా డిపాజిట్లు చెల్లించిన లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించలేదని ఆరోపిస్తూ గత ఏడాది పలుమార్లు జాలర్ల కుటుంబాలు రోడ్డెక్కి నిరసన తెలిపాయి. అయినా దీనిపై రాష్ట్రప్రభుత్వం పట్టించుకోలేదని తెలిసింది. దీంతో గత నెల 26వ తేదీ సుమారు వంద మందికి పైగా జాలరి కుటుంబాలు ఎన్నూర్ బీచ్ రోడ్డులో బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. సమాచారం తెలిసి అక్కడికి పోలీసులతో చేరుకున్న అధికారలు త్వరలోనే ఇళ్లు అప్పగించేలా చర్యలు చేపడతామని తెలిపారు. 20 రోజులు గడిచినా ఆ హామీ నెరవేరకపోవడంతో గురువారం ఉదయం మళ్ళీ జాలర్ల కుటుంబాలు రాస్తారోకో చేశారు. తిరుచినాంకుప్పం-ఎన్నూర్ ఎక్స్‌ప్రెస్ హైవేపై రాస్తారోకో చేపట్టినందువల్ల ఆ మార్గంలో ఇరువైపుల వాహనాలు నిలిచిపోయాయి. దీంతో రంగంలోకి దిగిన ఏసీపీ భాస్కరన్ వారం రోజుల్లో రాష్ట్రప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి ఈ సమస్యని పరిష్కరింపజేస్తామన్న హామీతో ఈ ఆందోళన సద్దుమణిగింది.

లొంగిపోయిన రోజే బెయిల్ పిటిషన్ పరిశీలించండి

- ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టుకు హైకోర్టు ఆదేశం

అడయార్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పుష్పవతి అయిన విద్యార్థినిని తరగతి బయట కూర్చోబెట్టి పరీక్ష రాయించిన కేసులో పాఠశాల ట్రస్టీ, ప్రిన్సిపాల్ లొంగిపోయిన రోజే వారి బెయిల్ పిటిషన్‌లను పరిశీలించాలని కోవై ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టుకు మద్రాస్ హైకోర్టు సూచించింది. నీలగిరి జిల్లా పొల్లాచ్చికి సమీపంలోని గ్రామంలో ఉన్న ప్రైవేటు పాఠశాలలో ఎనిమిదో తరగతి చదివే బాలిక రెండు వారాల క్రితం పుష్పవతి అయింది. ఈ నేపథ్యంలో ఈ నెల 7, 9వ తేదీల్లో జరిగిన వార్షిక పరీక్షలు రాసేందుకు వచ్చింది. ఆ సమయంలో బాలిక పుష్పవతి కావడం అంటుగా భావించి తరగతి గదికి దూరంగా ఒంటరిగా కూర్చోబెట్టి పరీక్ష రాయించారు. ఆ బాలికను తిరిగి ఇంటికి తీసుకెళ్ళేందుకు వచ్చిన తల్లి చూసి, భర్తకు చెప్పింది. ఆయన అవమానంగా భావించి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాఠశాల ట్రస్టీ తంగవేల్ పాండి, ప్రిన్సిపాల్ ఆనంది, అసిస్టెంట్ శాంతిలపై మూడు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో ఈ కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్న ట్రస్టీ, ప్రిన్సిపాల్ లొంగిపోయిన రోజే తమ బెయిల్ పిటిషన్లను పరిశీలించాలని నిందితులు ముగ్గురు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీన్ని పరిశీలించిన కోర్టు ఈ ముగ్గురు లొంగిపోయిన తర్వాతే వారి బెయిల్ పిటిషన్లను పరిశీలించాలని ఆదేశించింది.

జనవరి నుంచి 98 టన్నుల భవన వ్యర్థాల తొలగింపు

పెరంబూర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది జనవరి 1 నుంచి ఇప్పటివరకు 98 టన్నుల భవన వ్యర్థాలు తొలగించినట్లు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) తెలిపింది. బహిరంగ ప్రాంతాల్లో వేసే భవన నిర్మాణ వ్యర్థాలతో ట్రాఫిక్‌కు అంతరాయం, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారనే ఫిర్యాదులపై స్పందించిన కార్పొరేషన్, నిర్మాణ వ్యర్థాలు వేసేందుకు 15 ప్రాంతాలు ఎంపిక చేసింది. అలాగే, టన్ను వ్యర్థాలుంటే జీసీసీకి తెలియజేస్తే వాహనంలో ఉచితంగా తొలగిస్తారు. 1 నుంచి 20 టన్నుల వ్యర్థాల తొలగింపుకు రూ.3,300 రుసుము వసూలుచేయనున్నారు. నిబంధనలు అతిక్రమించి బహిరంగ ప్రాంతాల్లో నిర్మాణ వ్యర్థాలు వేసే వారికి టన్నుకు రూ.5 వేలు జరిమానా విధించే ప్రక్రియ ఈ నెల 21వ తేది నుంచి అమలుకు రానుందని జీసీసీ తెలిపింది.

ఎస్‌కేపీడీలో వైభవంగా ఆంజనేయ ఉత్సవం



ప్రత్యేక అలంకరణలో సీతారామ లక్ష్మణ, ఆంజనేయస్వామి

ప్యారీస్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక జార్జిటౌన్ ఆదియప్పవీధిలోని కన్యకా పరమేశ్వరి దేవస్థానం (ఎస్‌కేపీడీ)లో శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా గురువారం ఆంజనేయస్వామి ఉత్సవం నిర్వహించారు. ఈ ఆలయంలో ఈ నెల 6వ తేదీ ప్రారంభమైన శ్రీరామ నవమి ఉత్సవాల్లో ప్రతిరోజు ఉత్సవ మూర్తి అమ్మవారు, సీతారామ లక్ష్మణ, ఆంజనేయస్వామివార్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. వివిధ తెలుగు సంస్థలకు చెందిన కళాకారుల గాత్రకచేరి, భజన, కూచిపూడి, భరతనాట్యం కార్యక్రమాలు నిర్వహించారు. చివరి కార్యక్రమంగా గురువారం ఆంజనేయస్వామివారిని పూలు, ఆభరణాలతో అలంకరించి ఆలయ ప్రధాన అర్చకులు భాస్కర పంతుల బృందం పూజలు నిర్వహించింది. ఎస్‌కేపీడీ ట్రస్టీలు ఈ వైభవంలో పాల్గొన్న భక్తులందరికి ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ ఆలయంలో శుక్రవారం నుంచి వాసవాంబ వసంతోత్సవాలు ప్రారంభంకానున్నాయి. 24వ తేదీనుండి 26వరకు తెప్పోత్సవం జరుగనుంది. మే 4 నుండి 6వ తేదీవరకు లక్షార్చన, 7వ తేదీ వాసవీ జయంత్యుత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్టీలు తెలిపారు.

జాలర్లపై శ్రీలంక సముద్రపు దొంగల దాడి



దాడికి గురైన నలుగురు జాలర్లు

చెన్నై, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): నాగపట్టినం జిల్లా కోడియక్కరై సమీపంలో సముద్రంలో నాటు వల్లో వెళ్లి చేపలు పడుతున్న నలుగురు జాలర్లపై శ్రీలంక సముద్రపు దొంగలు దాడి జరిపి, వారి దగ్గరున్న విలువైన వస్తువులను దోచుకెళ్ళారు. గురువారం వేకువజాము పుదుపేటకు చెందిన జాలర్లు జగన్, రామకృష్ణన్, సెంథిల్, సాముయేల్ నాటు పడవలో చేపలుపడుతుండగా ఆ ప్రాంతానికి ఓ పడవలో వచ్చిన శ్రీలంక సముద్రపు దొంగలు వారిపై దాడి జరిపారు. ఆ సందర్భంగా పడవలో ఉన్న రూ.2లక్షల విలువైన ఇంజిన్, జీపీఎస్ పరికరాలు, రెండు సెల్‌ఫోన్లు, బ్యాటరీలు 50 కేజీల చేపలను కూడా దోచుకుని పారిపోయారు. ఈ సంఘటనలో గాయపడిన జాలర్లను చికిత్స నిమిత్తం వేదారణ్యం ఆసుపత్రికి తరలించారు.

విద్యార్థినిపై లైంగిక వేధింపు

- కరస్పాండెంట్‌పై కేసు నమోదు

ప్యారీస్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కోవైలోని ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున విద్యార్థినిని లైంగిక వేధింపులకు గురి చేసిన కరస్పాండెంట్‌పై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. కోవైలోని మహిళా పోలీస్‌స్టేషన్‌లో బాధిత విద్యార్థిని తాను చదువుకుంటున్న కళాశాల కరస్పాండెంట్‌పై ఫిర్యాదు చేసింది. గత 15వ తేదీ సాయంత్రం కళాశాల నుండి ఇంటికి బయలుదేరిన సమయంలో తనకు ఫోన్ చేసిన కరస్పాండెంట్ తన గదికి రావాలని పిలిచారని అక్కడికి వెళ్ళిన తనతో అసభ్యంగా ప్రవర్తించి లైంగికంగా వేధించారని ఫిర్యాదులో పేర్కొంది. దీని ఆధారంగా కేసు నమోదు చేసిన పోలీసులు సంబంధిత కళాశాల కరస్పాండెంట్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

ప్లస్‌టూ విద్యార్థిని ఆత్మహత్య

ప్యారీస్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన ప్లస్‌టూ పరీక్షల్లో తక్కువ మార్కులొస్తాయన్న భయంతో 17ఏళ్ల విద్యార్థిని మెరీనా బీచ్‌లో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. రాయపేట ముత్తయ్య గార్డెన్‌కు చెందిన రిటైర్డ్ బీఎస్ఎన్ఎల్ ఉద్యోగి మాణిక్యం వాసగం కుమార్తె సౌమ్య (17) ఇటీవల రాసిన ప్లస్‌టూ పరీక్షల్లో తక్కువ మార్కులు వస్తాయన్న భయంతో బుధవారం ఉదయం ఇంట్లో ఎవరికి చెప్పకుండా మెరీనా బీచ్‌లో దిగి అలల తాకిడికి మృతిచెందింది. సాయంత్రం మృతదేహం ఒడ్డుకు చేరుకోవడంతో అక్కడున్న జాలర్లు అందించిన సమాచారంతో పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని రాయపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

2 కేజీల వెండి వస్తువులతో ఉద్యోగి పరార్

అడయార్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెరంబూరు, పేపర్ మిల్స్ రోడ్డులోని నగల దుకాణంలో పనిచేస్తున్న ఉద్యోగి ఒకరు 2 కేజీల వెండి వస్తువులతో పరారైన సంఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు... పేపర్ మిల్స్ రోడ్డుకు చెందిన నితిన్ రాజారామ్ నగల దుకాణం నడుపుతున్నారు. మొదటి అంతస్తులో ఈ దుకాణంలో పనిచేసే ఆరుగురు ఉత్తరాది యువకులు ఉంటున్నారు. బుధవారం రాత్రి 10 గంటల సమయంలో దుకాణంలోని వెండి వస్తులను తనిఖీ చేయగా రెండు కేజీల వరకు వెండి సామగ్రి కనిపించలేదు. దీంతో ఆ ఆరుగురు యువకులను విచారించగా, గణేష్ అనే యువకుడు ఆ వస్తువులను చోరీ చేసి పారిపోయినట్టు చెప్పారు. దీంతో షాక్‌కు గురైన దుకాణం యజమాని పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

ముక్కోణపు ప్రేమకథ చిత్రం 'ఎన్ కాదలే'


సూచనలిస్తున్న దర్శకురాలు జయలక్ష్మి

స్కై వాండర్స్ ఎంటర్‌టైన్మెంట్ పతాకంపై జయలక్ష్మి స్వీయ నిర్మాణ దర్శకత్వంలో వచ్చిన చిత్రం 'ఎన్ కాదలే'. ముక్కోణపు ప్రేమకథా చిత్రం. 'కబాలి', 'పరియేరుమ్ పెరుమాళ్' తదితర చిత్రాల్లో సహాయక పాత్రలను పోషించిన లింగేష్ ఈ సినిమాల్లో ప్రధాన పాత్ర పోషించారు. లండన్‌కు చెందిన బ్రిటీష్ నటి లియా, దివ్య థామస్ హీరోయిన్లుగా నటించారు. నూతన నటుడు కాట్పాడి రాజన్ విలన్‌గా నటించారు. వీరితో పాటు మధుసూదన్ రావు, మారన్, గంజా కరుప్పు, సిద్ధ దర్శన్, సెంధమిళ్ తదితరులు ప్రధాన పాత్రలను పోషించారు. 'మూడర్ కూట్టమ్' ఫేం టోనీ జాన్ ఛాయాగ్రహణం అందించగా, శాండి శాంటెల్లో సంగీత స్వరాలు సమకూర్చారు. కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, నిర్మాత, దర్శకత్వం జయలక్ష్మి. ఈ సినిమా గురించి దర్శకురాలు జయలక్ష్మి మాట్లాడుతూ, 'తమిళ భాష, తమిళుల సంస్కృతి ప్రపంచ వ్యాప్తంగా ఎల్లవేళలా ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న దేశాలు తమిళ భాష గురించి తెలుసుకోవడానికి, పరిశోధనలు నిర్వహించడానికి ఆసక్తి చూపుతున్నాయి. తమిళ సంస్కృతిని అధ్యయనం చేయడానికి లండన్ నుంచి భారత్‌కు వచ్చిన హీరోయిన్ లియా, యువ జాలరి లింగేష్ ప్రేమలో పడుతుంది. ఆ తర్వాత ఆమె అనేక సమస్యల్లో చిక్కుకుంటుంది. చివరికి లియా పరిశోధన ఏమైంది? వారి ప్రేమ నిజమైందా? కాదా? అనే అంశాలు భావోద్వేగపరంగా చిత్రీకరించాం. ఈ సినిమా అభిమానులకు కొత్త అనుభూతిని ఇస్తుంది. కేరళ, కారైక్కాల్, నాగపట్టణం, పాండిచ్చేరి తీర ప్రాంతాలలో షూటింగ్ చేశాం' అన్నారు.

అమ్మాయిగా పుట్టివుంటే కమల్‌ను పెళ్ళాడేవాడిని : శివరాజ్ కుమార్


శివరాజ్ కుమార్, ఉపేంద్ర తదితరులు

తాను అమ్మాయిగా పుట్టివున్నట్టయితే అగ్రనటుడు కమల్ హాసన్‌ను పెళ్ళి చేసుకునివుండేవాడినని కన్నడ నటుడు శివరాజ్ కుమార్ అన్నారు. ఆయన నటించిన తాజా చిత్రం '45' ప్రమోషన్ కార్యక్రమం జరిగింది. ఇందులో శివరాజ్ కుమార్ మాట్లాడుతూ, 'నేను కమల్ హాసన్ వీరాభిమానిననే విషయం ప్రతి ఒక్కరికీ తెలుసు. అమెరికాలో క్యాన్సర్ ఆపరేషన్ తర్వాత కమల్ హాసన్ నుంచి ఫోన్ వచ్చింది. అంతా సర్దుకుంటుంది అని నమ్మకం కలిగించారు. అపుడు నాకు తెలియకుండానే నా కళ్ళలో నుంచి నీరు జాలువారింది.. హీరో అంటే కమల్‌లా ఉండాలి. కమల్ అంటే ఒక బ్యూటీ. ఒక వేళ నేను స్త్రీగా పుట్టివుంటే ఖచ్చితంగా ఆయనను పెళ్ళి చేసుకునివుంటాను. ఈ విషయాన్ని నేను పలుమార్లు చెప్పాను. ఒకసారి కమల్ మా ఇంటికి వచ్చారు. అపుడు నాన్నను ఆయన ఎవరు అని అడిగ్గా కమల్ హాసన్ అని చెప్పారు. ఆ వెంటనే ఆయనను ఒక సారి హగ్ చేసుకున్నాను. ఆ తర్వాత మూడు రోజుల పాటు స్నానం చేయలేదు. కమల్ అంటే అంతటి పిచ్చిప్రేమ. సూపర్ స్టార్ రజనీకాంత్ 'జైలర్-2' మూవీలో నేను నటిస్తున్నాను' అని పేర్కొన్నారు.


ఆల్బమ్ రిలీజ్ వేడుకలో పాల్గొన్న సినీ ప్రముఖులు

'మిస్ మేల క్రష్' అంటున్న సిద్ధార్థ్ పన్నీర్

- ఆల్బమ్ రిలీజ్ చేసిన వైరముత్తు

చిత్రజ్యోతి

మాస్టర్ సిద్ధార్థ్ పన్నీర్ నేపథ్యగానం చేసి, నటించి ఐదు భాషల్లో రూపొందించిన వీడియో ఆల్బమ్ సాంగ్ 'మిస్ మేల క్రష్'. ఈ సాంగ్ రిలీజ్ వేడుక నగరంలో తాజాగా జరిగింది. ప్రఖ్యాత గేయరచయిత వైరముత్తు, సంగీత దర్శకుడు దేవా, నటులు సెంథిల్, తంబిరామయ్య, కరుణాస్, ఇలవరసు రోబో శంకర్, బిగ్‌బాస్ ముత్తుకుమరన్, దర్శకులు సర్గుణం, ఇరా శరవణన్, బోస్ వెంకట్, తమిళనాడు హౌసింగ్ బోర్డు ఛైర్మన్ పూచ్చి మురుగన్, నటి గాయత్రి రఘురాం, కొరియోగ్రాఫర్లు రాధికా మాస్టర్, శాండి మాస్టర్, రామర్ రవికుమార్, కడంబూరు రాజా, రత్నం వంటి సినీ రాజకీయ ప్రముఖులు పాల్గొని వీడియో ఆల్బమ్ సాంగ్‌ను రిలీజ్ చేసి, సిద్ధార్థ్‌ను ఆశీర్వదించారు. ఈ వీడియో ఆల్బమ్‌కు దర్శకత్వం వహించిన సంగీత స్వరకర్త అశ్వమిత్రా మాట్లాడుతూ, 'సిద్ధార్థ్‌ను మరో ఆల్బమ్ సాంగ్ కోసం మొదట సంప్రదించడం జరిగింది. కానీ అది కార్యరూపం దాల్చలేదు. ఆ తర్వాత మరోపాటను క్రియేట్ చేయడంతో ఆ పాటను ఆలపించాడు. సిద్ధార్థ్‌లో మంచి టాలెంట్ ఉంది. ఏం చెప్పినా దాన్ని వెంటనే గ్రహించి చేస్తాడు. అందుకే ఈ వీడియో ఆల్బమ్ సాంగ్‌ను తమిళం, తెలుగు, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో రూపొందించాం. ఈ ఐదు భాషల్లో సిద్ధార్థే పాడాడు. ఈ వీడియో తర్వాత మరో మూడు ఆల్బమ్ సాంగ్‌లను రూపొందించాం. ఇందులో సిలంబం గురించి పాట కూడా ఉంది. సిలంబం ఆటలో సిద్ధార్థ్ జాతీయ చాంపియన్. అందుకే ఆ పాట రూపొందించాం. ఇలాంటి అవకాశాన్ని కల్పించిన నిర్మాతకు ధన్యవాదాలు. ఈ అల్బమ్ సాంగ్ అద్భుతంగా వచ్చేందుకు కృషి చేసిన సాంకేతిక నిపుణులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.


కాబోయే భర్తతో జనని అయ్యర్

పైలెట్‌ను పెళ్ళాడుతున్న జనని అయ్యర్

బాలా దర్శకత్వంలో వచ్చిన 'అవన్ ఇవల్' అనే చిత్రంలో కథానాయికగా వెండితెరకు పరిచయమైన జనని అయ్యర్... త్వరలోనే పెళ్ళిపీటలెక్కనున్నారు. తన స్నేహితుడైన సాయి రోషన్ శ్యామ్ అనే పైలెట్‌ను వివాహం చేసుకోనున్నారు. వీరి నిశ్చితార్థం తాజాగా నగరంలో జరిగింది. దీనికి సంబంధించిన ఫొటోలను ఆమె సోషల్ మీడియాలో షేర్ చేశారు. అయితే, వీరి వివాహం జరిగే తేదీ మాత్రం జనని వెల్లడించలేదు. కాగా, తమిళం, మలయాళ భాషా చిత్రాలపై దృష్టిసారించి సినీ కెరీర్ ఆమె కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో త్వరలో పెళ్ళిపీటలెక్కనున్న ఆమెకు సినీ రంగానికి చెందిన అనేక మంది ప్రముఖులు, సెలెబ్రిటీలు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

ఆధ్యాత్మికం


శయన భంగిమలో జీసెస్

భారతదేశంలోని అతిపెద్ద క్యాథలిక్ చర్చిల్లో రాజధాని నగరం చెన్నై ఎగ్మోర్ ప్రాంతంలో 18వ శతాబ్దంలో సేక్రెడ్ హార్ట్ (పవిత్ర హృదయం)ఆలయం ఒకటి. ఈ దివ్యక్షేత్రం స్వదేశీ,విదేశీ యాత్రికులకు స్వర్గ ధామం వంటిది. ఈ ఆలయంలో కొలువుదీరిన యేసుక్రీస్తును భక్తులు లోకరక్షకుడిగా భావించి పూజిస్తున్నారు. కుల,మతాలకు తావులేకుండా అన్ని వర్గాల ప్రజలు ఆలయంలో మొకరిల్లి ప్రార్థించడం విశేషం. ప్రతి శుక్రవారం వేలాదిమంది భక్తులతో ఈ క్షేత్రం కిటకిటలాడుతుంటుంది. మతసామరస్యాన్ని చాటుతున్న ఈ ఆలయం గురించి 'గుడ్ ఫ్రైడే', 'ఈస్టర్' పండుగల సందర్భంగా ప్రత్యేక కథనం.

- ప్యారీస్, ఆంధ్రజ్యోతి


ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న ఫాదర్‌లు


బాలయేసు మేరీమాత విగ్రహం

నేడు గుడ్‌ఫ్రైడే

మహిమాన్వితం

సేక్రెడ్ హార్ట్ దివ్యక్షేత్రం

పరిశుద్ధ స్థలంగా...

సేక్రెడ్ హార్ట్ చర్చి 2005 సెప్టెంబరు 8న మద్రాస్-మైలాపూర్ ఆర్చ్ డియోసెస్ పుణ్యక్షేత్రంగా ఎదిగింది. భక్తుల రద్దీ పెరగడంతో ప్రార్థనలు చేసేందుకు అనుకూలంగా 18వ శతాబ్దం నాటి చర్చి భవనాన్ని తొలగించి, ఆధునిక వసతులతో కొత్తభవనం నిర్మించాలని నిర్ణయించారు. 2009 ఏప్రిల్ 17వ తేదీ శంకుస్థాపనతో నిర్మాణం పనులు ప్రారంభించారు. 2013 జూన్ 21న కొత్త పుణ్యక్షేత్రాన్ని రోమ్‌లోని వాటికన్ పోప్ జాన్‌పాల్ ప్రపంచంలోని క్యాథలిక్ బిషప్‌ల సమక్షంలో 'పరిశుద్ధ స్థలం'గా అధికారికంగా ప్రకటించారు. అప్పటినుండి sacred heart shrine గా పిలువబడుతోంది. ఈ చర్చిలో ప్రతిరోజు ఉదయం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు పలు భాషల్లో ఆరాధన కార్యక్రమాలు జరుగుతున్నాయి.


ధ్యానమందిరం


'ఫుల్ ఫీట్'

ఆలయ చరిత్ర... : పోర్చుగల్‌కు చెందిన క్రైస్తవమత గురువు ఫాదర్ జెరోమ్ మతప్రచారం కోసం భారతదేశంలో కాలుమోపి పలు రాష్ట్రాల్లో పర్యటించారు. ఇందులో భాగంగా ఆయన అప్పటి మద్రాస్ ప్రిసీడియంలోని ఎగ్మూర్ పరిధిలోని కోమలీశ్వరన్‌పేటలో 1848లో స్థాపించబడిన 'సేక్రెడ్ హార్ట్ చర్చి'కి మొదటి ఫాదర్‌గా నియమితులయ్యారు. ఆ తర్వాత 1954లో ఫాదర్ బాధ్యతలు చేపట్టిన రాష్ట్రానికి చెందిన రెవ. ఏజే అదైకళం ఆలయం తరువున అనేక ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలను అమలు చేశారు. భక్తుల్లో 'పవిత్ర హృదయం' అనే భావన పెరగడంతో ప్రతి నెల మొదటి శుక్రవారం రోజు విశ్వశాంతిని కాంక్షిస్తూ ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమం ప్రజలను విశేషంగా ఆకర్షించడంతో ఈ ఆలయాన్ని సందర్శించే భక్తుల సంఖ్య బాగా పెరిగింది.


ఫాదర్ కాణిక్కైరాజ్ ప్రత్యేక ప్రార్థన

నిర్మాణశైలి అద్భుతం...

నగరం నడిఒడ్డున గోతిక్ శిల్పకళా నైపుణ్యం ఈ చర్చి ప్రత్యేకత. ఈ ప్రార్థనా మందిరం ముఖద్వారం దర్శిస్తేనే భక్తి భావం వెల్లువెత్తుతుంది. చర్చిలోకి అడుగుపెట్టగానే సింహద్వారం వద్ద చిరునవ్వుతో భక్తులను పలికరిస్తున్నట్టుగా యేసుక్రీస్తు విగ్రహం విశేషంగా ఆకట్టుకుంటోంది. హిందూ దేవాలయాల్లో మాదిరిగానే ఈ చర్చి ప్రాంగణంలో బంగారు పూతతో భారీ ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. మరో ప్రత్యేకత ఏమిటంటే యేసుక్రీస్తును శిలువలో వేలాడదీసి గాయపరిచిన ఈటె, గోర్లను ఈ క్షేత్రంలో భద్రపరిచారు. శిలువపై మరణించిన యేసుక్రీస్తు శరీరాన్ని సందర్శించేందుకు భక్తులు ప్రతి రోజు ఈ ఆలయానికి వస్తుంటారు. సంవత్సరంలో భస్మ బుధవారం, మాండీ గురువారం, గుడ్‌ఫ్రైడే, ఈస్టర్, క్రిస్మస్ పండుగ రోజుల్లో వేలాది మంది యాత్రికులు ఈ క్షేత్రంలో జరిగే ప్రత్యేక ఆరాధనలకు హాజరవుతారు.

గుడ్‌ఫ్రైడే, ఈస్టర్...

ఎగ్మోర్ సేక్రెడ్ హార్ట్ దివ్యక్షేత్రంలో ప్రస్తుత ఫాదర్ కానిక్కైరాజ్ అధ్యక్షతన మాండీ గురువారం, గుడ్‌ఫ్రైడే, ఈస్టర్ పండుగ సందర్భంగా ప్రత్యేక ఆరాధనలు నిర్వహించేందుకు ఆలయంలో భారీ ఏర్పాట్లు చేశారు. చర్చి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనశాలను సందర్శించే భక్తులకు ప్రత్యేక క్యూలైన్లు కూడా ఏర్పాటుచేశారు. మొదటి శుక్రవారం పేదలకు మధ్యాహ్నం భోజనం ఉచితంగా అందిస్తున్నారు. 24 గంటలు శుద్ధిచేసిన తాగునీరు, మరుగుదొడ్లు, తాత్కాలిక ఆస్పత్రి వంటి సదుపాయాలు కల్పించారు.

ధ్యాన మందిరం... : సమస్యల నుండి బయటపడాలనుకునేవారు ఏకాంతంగా ప్రార్థన చేసుకునేందుకు ప్రత్యేక ధ్యాన మందిరాన్ని నిర్మించారు. అదేవిధంగా మేరీమాత విగ్రహాన్ని కొలువుదీర్చిన గుహ వంటి సన్నిధిలో మహిళలు, వృద్ధులు, చిన్నారులు, దివ్యాంగులు, రోగుల కోసం ప్రత్యేక ప్రార్థనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్ నుండి 3 కి.మీ, ఎగ్మోర్ రైల్వేస్టేషన్ నుండి 600 మీటర్ల దూరంలోవున్న ఈ క్షేత్రానికి సిటీబస్సులు, ఆటోలు అందుబాటులో వున్నాయి.


చర్చిలో జీసెస్ విగ్రహం - ధ్వజస్తంభం - గుహలో మేరీమాత

నేడు కోవైలో 'బిల్డ్ ఇన్‌టెక్-2025' ఎగ్జిబిషన్ ప్రారంభం

అడయార్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కోవైలో కొడీసియా ఆధ్వర్యంలో 'బిల్డ్ ఇన్‌టెక్-2025' పేరుతో ఎగ్జిబిషన్ ప్రారంభంకానుంది. నాలుగు రోజుల పాటు జరిగే ఈ ఎగ్జిబిషన్‌కు సంబంధించి కొడీసియా అధ్యక్షుడు కార్తికేయన్, ఎగ్జిబిషన్ ఛైర్మన్ జ్ఞానవల్లన్ సంయుక్తంగా మీడియా సమావేశం ఏర్పాటుచేశారు. వారు మాట్లాడుతూ, 'అధునాతన భవన నిర్మాణ సామగ్రి, యంత్రాలు, నిర్మాణ పద్ధతులు, కన్‌స్ట్రక్షన్ మెళకువలు తదితర అంశాలపై ఈ ప్రదర్శన సాగుతుందన్నారు. ఒక్క మన రాష్ట్రం నుంచే కాకుండా, ఢిల్లీ, గుజరాత్, హర్యానా, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర, పుదుచ్చేరి వంటి రాష్ట్రాల నుంచి 250కు పైగా భవన నిర్మాణ కంపెనీలు పాలుపంచుకుంటాయని వెల్లడించారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరిగే ఈ ప్రదర్శనను సుమారుగా 4 వేల మంది సందర్శిస్తారని అంచనా వేస్తున్నామన్నారు. ప్రదర్శన ప్రారంభోత్సవంలో జిల్లా కలెక్టర్ పవన్‌కుమార్ పాల్గొంటారని తెలిపారు.


స్వాతంత్ర్య సమరయోధుడు ధీరన్ చిన్నమలై జయంతి సందర్భంగా ఆయన విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి, మాజీ మంత్రులు, పార్టీ నేతలు


గిండిలో స్వాతంత్ర్య సమరయోధుడు ధీరన్ చిన్నమలై జయంతి సందర్భంగా ఆయన విగ్రహం వద్ద చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఎం స్టాలిన్, మంత్రులు, టీఎన్‌సీసీ నేత సెల్వపెరుంతగై తదితరులు

ఆక్రమణలకు గురవుతున్న

ముట్టుక్కాడు తీరప్రాంతం


కరికట్టుకుప్పం తీరాన్ని ఆనుకుని నిర్మించిన భవనాలు

వాషర్‌మెన్‌పేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక స్థలమైన ముట్టుక్కాడు తీర ప్రాంతం ఆక్రమణలకు గురవుతోంది. నిబంధనలను ఉల్లంఘిస్తూ తీరం వెంబడి ఆక్రమణదారులు సజావుగా నిర్మాణాలను కొనసాగిస్తున్నారు. చర్యలు చేపట్టాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. చెన్నైకు అత్యంత సమీపంలో ఉన్న పర్యాటక స్థలాల్లో ముట్టుక్కాడు కూడా ఒకటి. ఇక్కడ బోటింగ్ చేయడానికి పర్యాటకులు ఉత్సాహం చూపిస్తుంటారు. ఈ ముట్టుక్కాడులోని ఒక ప్రాంతమే కరికట్టు కుప్పం. కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ ప్లాన్ మ్యాప్ ప్రకారం ఈ కుప్పం నాన్ డెవలప్‌మెంట్ జోన్ (ఎన్‌డిజెడ్) అభివృద్ధిలేని జోన్ పరిధిలోకి వస్తుంది. బలమైన అలల తాకిడి ఎక్కువగా ఉన్న తీరం నుంచి 200 మీటర్ల వరకు గల ప్రాంతాన్ని ఎన్‌డిజెడ్‌గా పరిగణిస్తారు. సునామీ సంభవించిన సమయంలో ఈ కుప్పంతో పాటు దీని చుట్టూ ఉన్న కుప్పాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. దాంతో ఇదివరకే ఉన్న భవనాలకు మరమ్మతులు, పునర్నిర్మాణ పనులు తప్ప కొత్త భవన నిర్మాణాలకు ఈ ప్రాంతంలో నిషేధం విధించారు. మత్స్యకారులకు, తీర ప్రాంత సౌకర్యాలకు అవసరమయ్యే ప్రాజెక్టులు తప్ప మరే ప్రాజెక్టులకు ప్రభుత్వం నుండి అనుమతులు పొందలేము. పరిస్థితి ఇలా ఉంటే, ఈ కరికట్టు కుప్పంలో అడ్డు అదుపూ లేకుండా నూతన భవనాలు వెలుస్తున్నాయి. కొన్ని భవనాల నిర్మాణ పనులు ఇప్పుడే ప్రారంభిస్తుండగా మరికొన్ని నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. స్థానిక రాజకీయ నాయకులు, ప్రభుత్వ అధికారుల అండదండలు లేనిదే ఈ నిర్మాణాలకు సాధ్యం కాదని ముట్టుక్కాడుకు చెందిన మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. సునామీ అనంతరం మత్స్యకారులను ఇక్కడి నుండి తరలించి పునరావాసం కల్పించారని, ఇప్పుడు అదే స్థలాలను కొంతమంది ఆక్రమించుకొని భవన నిర్మాణాలను చేపడుతున్నారని వాపోతున్నారు.


సముద్రపు కోతను అడ్డుకునేందుకు పేర్చిన బండరాళ్లు

దీనిపై మత్స్యకారుల సంఘ కార్యకర్త శరవణన్ మాట్లాడుతూ రికార్డుల ప్రకారం ఇది గ్రామ నత్తం అనగా భూమిలేని వారి కోసం ఉద్దేశించబడిన నివాస గ్రామ స్థలంగా వర్గీకరించబడినదని, అయితే కొంతమంది తమ పలుకుబడిని ఉపయోగించి స్థలాలను ఆక్రమిస్తున్నారని తెలిపారు. కొన్ని భవనాల్లో బోర్లు కూడా తవ్వుతున్నారని, ఈ విషయంపై అధికారులకు ఫిర్యాదు చేస్తే వారు షోకాజు నోటీసులతో సరిపెట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమంగా నిర్మాణాలు చేపట్టడమేగాక, తమ భవనాలు సముద్రపు అలల కోతకు గురికాకుండా ఉండేందుకు తీరంవెంబడి బండరాళ్లను వేస్తున్నారని ఇది పర్యావరణాన్ని పూర్తిగా దెబ్బతీస్తుందని పర్యావరణ ప్రేమికులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంపై స్పందించిన పర్యావరణ, అటవీశాఖ అదనపు కార్యదర్శి సుప్రియా సాహు తాము జిల్లా అధికారులకు సమాచారం ఇచ్చామని, త్వరలో చర్యలు చేపడతామని వెల్లడించారు.





చంద్రబాబు గొప్ప దార్శనికుడు అని ప్రపంచం కీర్తిస్తుంది. సంక్షోభాలను సైతం అనుకూలంగా మలచుకోగల నేర్పుగల నాయకుడు అని రాజకీయ పండితులు పొగుడుతారు. ఇంజనీరింగ్ చదువుకోలేదు కానీ టెక్నాలజీని ఔపోసన పట్టిన మేధావిగా అందరూ గుర్తిస్తారు. అభివృద్ధికి దారులు వెతకడానికి తపనపడే నారా చంద్రబాబు నాయుడిలో ఈ లక్షణాలన్నీ చిన్ననాటి నుంచే ఉన్నాయి.

నారావారిపల్లిలో మధ్యతరగతి రైతు కుటుంబంలో పుట్టిన చంద్రబాబు.. వెనుకబాటుతనంపై సీఎంగా చేస్తున్న పోరాటానికి బీజాలు బాల్యంలోనే ఉన్నాయని ఆయన చిన్ననాటి నేస్తాల మాటల్లో వెల్లడవుతోంది.. ఈ 75 ఏళ్ల నిత్య ఉత్సాహి బాల్య జ్ఞాపకాలను ఆంధ్రజ్యోతితో వారు పంచుకున్నారు.

ఇంటర్వ్యూలు
ఆంధ్రజ్యోతి బ్యూరో
తిరుపతి



భూములు, బావులున్నోడే!

చంద్రబాబు తండ్రి ఖర్జూరనాయుడుకు రెండెకరాల భూమి మాత్రమే వుండేదని, అలాంటిది చంద్రబాబుకు ఇంత ఆస్తి ఎలా వచ్చిందని రాజకీయ ప్రత్యర్థులు తరచూ ఆరోపణలు, విమర్శలు చేస్తుంటారు. అవి విన్నప్పుడు నాకు నవ్వు వస్తుంటుంది. మాది ఎ.రంగంపేట. చంద్రబాబుది నారావారిపల్లి. ఇద్దరం ఆరో క్లాసు నుంచీ కలసి చదువుకున్నాం. ఇప్పటికీ మా ఫ్రెండ్‌షిప్ కొనసాగతానే వుంది. మేము హైస్కూల్లో చదువుకునేటప్పటికే చంద్రబాబు వాళ్ళకు 15 ఎకరాల భూములు వున్నాయి. చెరకు, వరి, వేరుశెనగ పంటలు వేసే వాళ్ళు ఎంతమంది ఎన్ని అన్నా చంద్రబాబు నోరు మెదపడు. నా చిన్నతనంలోనే 15 ఎకరాలు వుండేదని చెప్పి ప్రత్యర్థుల నోళ్ళు మూపించచ్చు కదా! కానీ అలా చేయడు. అదీ చంద్రబాబు!

పావలా వడ్డీకి అప్పులిచ్చేవాడు ఖర్జూరనాయుడు

చంద్రబాబు తండ్రి ఖర్జూరనాయుడు ఆ రోజుల్లోనే చుట్టుపక్కల రైతులకు అప్పులిచ్చేవాడు. నాకు బాగా గుర్తుంది. అవసరానికి వచ్చి అప్పు అడిగే వాళ్ళకు, ఆయన ఆ కాలంలోనే పావలా వడ్డీకి అప్పులిచ్చేవాడు.పంచె అంచు పక్కకు లాగి డ్రాయరు జేబులో నుంచీ నోట్లు తీసి లెక్కబెట్టి ఇవ్వడం ఎన్నో సార్లు చూసినా.

12 కిలోమీటర్లు నడిచి బడికి

చంద్రబాబూ నేనూ రోజూ అడ్డదావన ఆరు కిలోమీటర్లు నడిచి చంద్రగిరి హైస్కూలుకు పోయేవాళ్ళం. మళ్ళా సాయంకాలం ఆరు కిలోమీటర్లు నడిచి ఇంటికి చేరేవాళ్ళం. నారావారిపల్లి నుంచీ దర్శిపల్లి దళితవాడ, పుల్లయ్యగారిపల్లి, కొట్టాల గరండాలు (రైలు వంతెన), రెండు గుట్టల మధ్య ఆంజనేయస్వామి గుడి దాటి చంద్రగిరి హైస్కూలు గ్రౌండ్‌లోకి వెనక దారి నుంచీ చేరుకుంటా వుంటిమి. స్కూల్లో చంద్రబాబుది బి సెక్షన్. నాది సి సెక్షన్. క్లాసులోనే విడిగా కుర్చునేది. మిగిలిన సమయమంతా ఇద్దరం కలిసే తిరిగే వాళ్ళం.

పాస్ చేయలేదని స్కూలే మారిపాయినాడు

చంద్రగిరి హైస్కూలులో చంద్రబాబు చదివింది తొమ్మిది దాకానే. తొమ్మిదో తరగతి పరీక్షల్లో చంద్రబాబుకి మ్యాథ్స్‌లో పాస్ మార్కుల కంటే ఒక మార్కు తగ్గింది. పదహైదు ఇరవై మందిమి కలసి హెడ్‌మాస్టర్ పద్మనాభరెడ్డి దగ్గరికి పోయినాం. ఒక్క మార్కే..సార్.. పాస్ చేయండి సార్.. అని బతిమిలాడినాం. ఆయన మొండోడు. కాదనేసినాడు. ఇంక ఊళ్ళో పెద్దోళ్ళంతా కలసి ఆర్ ఎంఎస్ నాయుడును కలిసి అడిగినారు. అయినా కుదరదనేసినాడు. దీంతో చంద్రబాబు 'నాకు చంద్రగిరి హైస్కూలే వద్దు' అని టీసీ తీసుకునేసినాడు. తిరుపతిలో టీపీపీఎం హైస్కూలో చేరిపోయినాడు. చంద్రబాబుకు అంత పౌరుషం, పట్టుదల వుండేది.

మా సైకిలు జోరు

చంద్రబాబుకు వాళ్ళ నాయన తొమ్మిదో తరగతిలో కొత్త సైకిల్ కొనిచ్చినాడు. నాకు ఎనిమిదిలోనే సైకిల్ కొనిచ్చినారు. చంద్రబాబు, నేను ఇద్దరం కొత్త సైకిల్ మీద తెగ తిరిగేవాళ్ళం. అప్పట్లో చంద్రగిరి హైస్కూల్లో సరస్వతీ పూజకి పూలు తేవల్లా అని టీచర్లు చెప్పినారు. ఇంకేం కొత్త సైకిలు ఉండనే ఉంది. రయ్యిమని ఇద్దరం నారావారి పల్లికి చేరుకున్నాం. పుల్లయ్యగారిపల్లి కాలవలో గన్నేరు పూలు, మొగిలి పూలు పెరుక్కుని తిరిగి స్కూలుకు బయల్దేరినాము.ఎ.రంగంపేట దాటినాక జోడు బావుల దెగ్గిర సైకిల్ మీద నుంచీ పడిపోయినాం. ఇద్దరం ఒళ్లంతా దెబ్బలు తగిలించుకున్నాం. ఆ దినం కుంటుకుంటా పోతే స్కూల్లోనూ, ఇంట్లోనూ కూడా తిట్లు తప్పలా.

పీయూసీలోనే జన్మభూమి

చంద్రబాబు సీఎం అయినాక శ్రమదానం, జన్మభూమి కార్యక్రమాలు పెట్టింది రాష్ట్రంలో అందరికీ తెలుసు. అయితే మేము చదువుకునేటప్పుడే మా పల్లెల్లో అభివృద్ధి పనులకు శ్రమదానం చేయించాడు చంద్రబాబు. శేషాపురం, కందులవారిపల్లి, నారావారిపల్లి,ఎ.రంగంపేట గ్రామాల మీదుగా కొంటి కాలువ, బాపన కాలువ పారేవి. పీయూసీలో వుండగా అప్పటికి ఈ రెండు కాలువలూ పూడిపోయి, ముండ్ల చెట్లు పెరిగిపోయినాయి. కాలువలు కనిపించకుండాపోయాయి. అది చూసి చంద్రబాబు మమ్మల్నందరినీ పుడ్డ చేసి శ్రమదానంతో కాలువలు బాగు చేయిచ్చినాడు. అంతా పిల్లోల్లమే.. కాలవల్లోకి దిగి పూడిక తీసి, చెట్లన్నీ కొట్టేసి తిరిగి నీళ్ళు పారేదానికి అనువుగా చేసినాము.



పడాకుల సుబ్బరామిరెడ్డి

నారావారిపల్లికి ఆనుకుని ఉండే ఏ.రంగంపేట వాసి పడాకుల సుబ్బరామిరెడ్డి. చంద్రగిరి జిల్లా పరిషత్ హైస్కూల్లో చంద్రబాబుతో కలసి చదువుకున్నారు. తర్వాత మళ్ళీ తిరుపతి ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో కలసి డిగ్రీ చదివారు. సన్నిహిత మిత్రుడు. రాజకీయాల్లో కూడా చంద్రబాబు వెన్నంటి నడిచారు. ఏ.రంగంపేటకు గతంలో టీడీపీ తరపున ఎంపీటీసీగా కూడా గెలిచారు. ప్రస్తుతం వ్యవసాయం చేసుకుంటూ గ్రామంలోనే నివసిస్తున్నారు.

ఎన్టీయార్ అల్లుడు.. ఒకప్పుడు ఏఎన్ఆర్ అభిమాని

చంద్రబాబు సాక్షాత్తూ ఎన్టీయార్ అల్లుడు. అయినా సినీ రంగంలో ఆయన ఫేవరెట్ హీరో అక్కినేని. వినడానికి విచిత్రంగా అనిపించినా ఇది నిజం. తిరుపతిలో పీయూసీ చదివే రోజుల్లో అక్కినేని నాగేశ్వరరావు సినిమా రిలీజైందంటే చాలు ఎక్కడున్నా మొదటి రోజు మొదటి షో చూడాల్సిందే. పదీ ఇరవై మంది స్నేహితులతో కలసి గుంపుగా వెళ్ళేవాళ్ళం. తిరుపతి ప్రతాప్ థియేటర్‌లో టికెట్ కౌంటర్ వాళ్ళను దబాయించి మరీ టికెట్లు తీసుకుని సినిమా చూసేవాళ్ళం.

రెండూళ్లలో పెరిగిన బిడ్డ

నారావారిపల్లికి, కందులవారిపల్లికి మధ్య పొలాలే అడ్డు. ఫర్లాంగు దూరానికి మించదు. మా అమ్మ, నాయన, మా అన్నలు ఇద్దురూ (చంద్రబాబు అమ్మమ్మ, తాత, మేనమామలు) చంద్రబాబును మురిపంగా చూసేవాళ్ళు. తక్కవంటే రోజులో రెండు సార్లన్నా ఆటికీ ఈటికీ తిరుగులాడేవాడు. రెండూర్లలో పెరిగినాడు.

మహర్జాతకుడు

చంద్రబాబు పుట్టింది తిరుపతి ప్రభుత్వాస్పత్రిలో...

మాది కందులవారిపల్లి. నారావారిపల్లికి ఫర్లాంగు దూరంలో వుంటుంది. మా అక్క అమ్మణ్ణమ్మను నారావారిపల్లిలో ఇచ్చినారు. మా ముగ్గురు అన్నదమ్ముల్లో నేనే కడగొట్టు. అప్పటికి నేను పసోన్ని. అక్కకు సాయంగా వుండమని నన్ను నారావారిపల్లికి పంపిచ్చిరి. చంద్రబాబు పుట్టింది తిరపతి ప్రభుత్వాస్పత్రిలో. అప్పటికి రుయాస్పత్రి లేదు. చంద్రబాబుకు, నాకు వయసులో పెద్ద అంతరం లేదు. వాళ్ళింట్లోనే ఇద్దరం కలిసి పెరిగినాము. మా అక్క వాళ్ళది నా చిన్నతనంలోనే పెద్ద సేద్యం. పది ఆవులతో పాటు ఎనుములు, గొర్రెలు, పొట్టేళ్ళు వుండేటివి. గొర్రెలు, పొట్టేళ్ళు మేపే పని నాదే.

సాప మీద చంద్రబాబు... ఇంట్లోకి దూరిన పాము

చంద్రబాబు రోజుల బిడ్డగా వున్నపుడు కందులవారిపల్లిలోని మా ఇంట్లోనే అక్క వుండేది. ఇంట్లో సాప మీద చంద్రబాబును పడుకోబెట్టి బయట పనులు చేసుకుంటా వుంటే నాగుపాము ఇంట్లోకి దూరింది. ఆడోళ్ళంతా భయపడి గగ్గోలు పెట్టారు. మగోళ్ళు వచ్చి పామును పట్టి బయటకు తీసుకెళ్ళారు. దాని గురించి ఆడోళ్ళు గుర్తు చేసుకుని చెప్పుకునేది. అప్పట్లోనే వానికి (చంద్రబాబుకు) ఏందో మహర్జాతకం వుందనే వాళ్ళు.

రెండేండ్ల వయసులో నీళ్ళ తొట్టిలో పడిపోయినాడు!

రెండేండ్ల వయసులో చంద్రబాబు నీళ్ళ తొట్టిలో పడిపోయినాడంట. వాళ్ళ చిన్నాయన గభాల్న బయటకు తీసినాడంట. ఆ తీసేటప్పుడు తలకిందలుగా కాళ్ళు పట్టుకుని ఎలదీసినాడంట. దానికి వాళ్ళ నాయన 'తలకిందలగా కాళ్ళు పట్టుకుని పైకెత్తతావా నా బిడ్డని' అని తమ్ముని మీద గలాటకు పోయినాడంట.

చంద్రబాబు నొస్టన గాయం!

ఓ రోజు మా బావ ఖర్జూరనాయుడు సంతకు పోయుండి టెంకాయ తెచ్చినాడు. అప్పుడు నాకు పన్నెండేండ్లు వుంటాయి. చంద్రబాబుకు ఏడేండ్లు వుంటుంది. ఇంటి ముందర తిన్నె మీద టెంకాయ గొట్టినా. పగిలి సగం చిప్ప పైకి ఎగిరింది. అది పొయ్యి చంద్రబాబుకు నొస్టన తగిలింది. నెత్తురు బొడబొడా కారింది. అదిజూసి నాకు భయం పెరుక్కునింది. మా అక్కా బావ కొడతారేమో నని దూరంగా పరిగెత్తుకునిపొయినా. ఇప్పటికీ చంద్రబాబుకు నొస్టన ఆ మచ్చ కనిపిస్తుంది.



కనుమూరి చిన్నబ్బ నాయుడు

చంద్రబాబుకున్న ముగ్గురు మేనమామల్లో అందరికంటే చిన్నవాడు కనుమూరి చిన్నబ్బ నాయుడు. అక్కకు సాయంగా వుండేందుకు పసితనంలోనే కందులవారిపల్లి నుంచీ నారావారిపల్లిలోని అక్క ఇంటికి పంపించారు తల్లిదండ్రులు. చంద్రబాబు కంటే వయసులో ఐదేళ్ళు పెద్దవాడు. అక్క కుటుంబానికి సేద్యంలోనూ, పశుపోషణలోనూ, ఇంటి పనుల్లోనూ సాయంగా నిలిచి ఆ ఇంట్లోనే కుటుంబసభ్యుడిగా పెరిగిన మనిషి. చంద్రబాబు పుట్టింది మొదలు ముఖ్యమంత్రి అయ్యేవరకూ అన్నింటికీ ప్రత్యక్ష సాక్షి. చంద్రబాబు చదువు నుంచీ రాజకీయాల వరకూ అన్నింటా చేదోడువాదోడుగా మెలిగిన వ్యక్తి. ప్రస్తుతం నారావారిపల్లెలో వ్యవసాయం చేసుకుంటున్నారు.




చంద్రబాబు చదువుకున్న బడి

ప్రతి శనివారం అడ్డదావన కొండకు

శనివారం వచ్చిందంటే అందురం కొండకు పోవల్సిందే. పెద్దా చిన్నా అంతా గుంపుగా బయల్దేరేది. నారావారిపల్లి నుంచీ ఉత్తరంగా అడ్డదారిన అడివి గుండా శ్రీవారి మెట్టు చేరుకుని అక్కడ నుంచీ మెట్ల దారిన కొండ ఎక్కుతా వుంటిమి.స్వామి దర్శనం చేసుకుని మళ్ళా అదే దావన ఇంటికి చేరుకుంటా వుంటిమి.తిరుమల శనివారాలు వస్తే ప్రతి శనివారం పల్లిలో వాళ్ళు, చుట్టుపక్కల పల్లెల నుంచీ వచ్చే వాళ్ళతో కలసి గోయిందలు పెడతా కొండకు పోతా వుంటిమి. ఇంటి కాడ పెద్దోళ్ళు మనిషికి అర్ధరూపాయి,రూపాయి లెక్కన ఇచ్చేవాళ్ళుమేము అది కూడా కర్చుపెట్టకుండా అట్నే ఎనిక్కి తెస్తావుంటిమి. కాలేజీలో చేరేదాకా చంద్రబాబు ప్రతి శనివారం కొండకు మాతో పాటు వచ్చేది.

ఎజ్డీ డబులింజను బైకు బుల్లోడు



నారా సుబ్రమణ్యం నాయుడు

చంద్రబాబు స్వంత చిన్నాన్న అయిన నారా చిన్న పాపయ్యనాయుడు కొడుకు నారా సుబ్రమణ్యం నాయుడు. వయసులో ఐదేళ్ళు చిన్నవాడు. బాల్యంలో ప్రతి అడుగులో చంద్రబాబు వెన్నంటి నడిచిన వాడు. వ్యవసాయ బావుల్లో ఈతాడినా, తిరుమల కొండకు నడిచి వెళ్ళినా, చుట్టుపక్కల ఊళ్ళలో జల్లికట్టు చూసినా, ఎన్నికల్లో ప్రచారానికైనా... అన్న తోడు వదలని తమ్ముడు. కోర్టులో ఉద్యోగం చేసి రిటైరయ్యారు. ప్రస్తుతం నారావారిపల్లిలోనే నివాసం.

మడక దున్నేవాడు!

చంద్రబాబు మా సొంత పెద్దనాయన కొడుకు. నాకంటే ఐదేండ్లు పెద్దోడు.వ్యవసాయ పనులు బాగా చేసేవాడు. చెరుకు సాగుకు వెనక మడక దున్నడం, కోతలయ్యాక వాది కట్టడం వంటి పనులు చేసేవాడు. అప్పట్లో చెరుకు గానుగ రెండు నెలలు ఆడతావుంటిమి.గానుగలో చెరుకు పెట్టే పని కూడా చంద్రబాబు ఇష్టంగా చేసేవాడు. అయితే ఇంట్లో వాళ్ళు చంద్రబాబుకు పెద్దగా సేద్యం పనులు చెప్పేవాళ్ళు కాదు. మేనమామలు కూడా అయన్ను బాగా ప్రేమగా చూసుకునేవారు.

పొట్టేళ్ళమ్మిన ఖర్జూర నాయుడు

చంద్రబాబు చదువుకునేటప్పటికి వాళ్ళకు పది ఆవులతో పాటు ఎనుములు, గొర్రెలు, పొట్టేళ్ళు వుండేవి.వాటిని నేనే మేపతా వుంటి. మళ్ళ రాత్రానూ మా పెద్దనాయన మనం మేపలేములేరా అని పాలికి వదిలేది మొదులుపెట్టినాడు. చంద్రబాబు తొలిసారి ఎమ్మెల్యేగా పోటీ చేసినపుడు మనకెందుకని మా పెద్దనాయన ఏమాత్రం అడ్డం చెప్పలేదు. వున్న పొట్టేళ్ళన్నీ అమ్మేసి 'ఎలక్షన్లలో ఖర్చు పెట్టుకో నాయనా' అని రూ. 60 వేలు ఇచ్చినాడు. అప్పటికి ఇంట్లో రెండు లోడ్ల బెల్లం స్టాకు వుంది. అయితే రేటు లేదని బెల్లం అమ్మలేదు. లేకపోతే అదిగూడా ఇచ్చేసి ఉండేవాడు.

ఈత నేర్పించింది చంద్రబాబే!

చదువుకునేటప్పుడు ఎండాకాలం వచ్చిందంటే చాలు పిల్లోల్లందరం బావులకాడికి పరిగెత్తేవాళ్ళం.గంటల కొద్దీ ఈతాడేవాళ్ళం. మా ఊరి పక్కనే తెల్లాకల శెట్టి బావి వుంది. ఆ బాయిలోనే అందరం ఈతాడేది. నా చిన్నప్పుడు ఊర్లో పిల్లకాయలందరినీ చంద్రబాబే వెనకంటీ పెట్టుకోని బాయి కాడకు పిల్చకపోయేవాడు. అప్పట్లో పిల్లోల్లకు ఈత నేర్పించింది ఆయనే.

పీజీలో ఎజ్డీ డబులింజన్ బైక్

చంద్రబాబు తిరపతిలో పీజీ చేసేటపుడు ఎప్పుడు చూసినా వెనకంటీ పదీ ఇరవై మంది పిల్లోల్లు వుండేది. ఎప్పుడన్నా ఇంటికొస్తే కూడా వెనకంటీ పది మందికి తక్కవ లేకుండా వచ్చేవాళ్ళు. మా పెద్దనాయన కొడుకును అట్ల చూస్తే చానా సంతోషపడిపోయేవాడు. కొడుకు నలుగురిలో దర్జాగా వుండల్లని ఎజ్డీ బైక్ కొనిచ్చినాడు. అది డబులింజన్ బండి. బుల్లెట్ కంటే ఎక్కువ సౌండ్ వచ్చేది. బడబడమని సౌండ్‌తో ఆ బండి మీద కొండకు పొయ్యేవాడు. అది చూసి మా పెద్దనాయన మురిసిపొయ్యేవాడు.

చంద్రబాబు కోసం ప్రచారానికి వందలమంది విద్యార్థులు

చంద్రబాబు 1978లో తొలిసారి ఎలక్షన్లలో పోటీ చేసినపుడు వెనకంటీ తిరిగిందీ, ప్రచారం చేసిందీ, ఇంటింటికీ పోయి ఓట్లడిగిందీ.. అంతా ఈడు పిలకాయలే. తిరపతి యూనివర్శిటీ నుంచే వందల మంది స్టూడెంట్లు ప్రచారానికి వచ్చినారు. ఇంటికాడ ఆడోళ్ళకు పులుసన్నం వండేదే పని. వాటిని పొట్లాలు కట్టి ప్రచారానికి పొయ్యే వాళ్ళకు అందిచ్చేది మా పని. ఎలక్షన్ చేసిందంతా పిల్లోల్లే.

బడికోసం జోలె పట్టాడు

శ్రమదానంతో సొంతూరికి రోడ్డు

నారావారిపల్లి నుంచీ మా కందులవారిపల్లి అర కిలో మీటరు దూరంలో వుంటుంది. మేమిద్దరం శేషాపురంలో ప్రైమరీ స్కూలు, తర్వాత తిరుపతిలో పీయూసీ, డిగ్రీలలో క్లాస్‌మేట్స్. అంతకంటే దగ్గర బంధువులం కూడా. దాని వల్ల చిన్నప్పటి నుంచీ కలసి పెరిగాము. కలసి చదువుకున్నాం. చంద్రబాబుతో జ్ఞాపకాలు ఒకటా రెండా?

రోడ్డు బాగయ్యింది

చంద్రబాబు పీజీ పూర్తి చేశాక 1977లో యూత్ కాంగ్రెస్‌లో చురుగ్గా పనిచేశాడు.ఆ సంవత్సరంలోనే పులిచెర్ల సమితి యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడయ్యాడు. శ్రమదానంతో గ్రామాల్లో యువత అభివృద్ధి పనులు చేపట్టాలని అప్పట్లో సంజయ్ గాంధీ పిలుపిచ్చారు. దానిని చంద్రబాబు పట్టుదలగా తీసుకున్నాడు. అప్పట్లో ఎ.రంగంపేట నుంచీ నారావారిపల్లి, శేషాపురం మీదుగా భీమవరం వరకూ ఐదు కిలో మీటర్ల రోడ్డు చాలా అధ్వానంగా వుండేది. ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లు పోవడం కూడా కష్టమయ్యేది. రోడ్డంతా బురదగా వుండేది.చంద్రబాబు స్నేహితులందరినీ పోగేసి ఈ రోడ్డు బాగు చేసే పనికి పూనుకున్నాడు. అందరం నడుములు వంచాం.ఆయా గ్రామాల్లోని యువకులు వచ్చి కలిశారు. ఇలా ఐదు కిలోమీటర్ల రోడ్డు బాగు చేశాం.

హైస్కూలు కోసం జోలె పట్టుకున్నాడు

ఎ.రంగంపేటలో అప్పర్ ప్రైమరీ స్కూలు మాత్రమే వుండేది. పిలకాయల పై చదువులకు ఇబ్బందిగా వుండేది. చంద్రగిరికి పోవల్లంటే వంకలు, కాలవలు దాటల్ల. తిరుపతి పోవల్లంటే దూరాభారం. దాన్ని హైస్కూలుగా అప్‌గ్రేడ్ చేయాలని పెద్దోళ్ళంతా కలిసి చిత్తూరులో జడ్పీ ఆఫీసుకు పోయి అర్జీ ఇచ్చినారు. రూ. 8 వేలు కార్పస్ ఫండ్ కడితే అప్‌గ్రేడ్ చేస్తామని చెప్పినారంట. అంత దుడ్లు ఎవురిచ్చేది? చంద్రబాబు అప్పుడు తిరుపతిలో పీజీ చేస్తా ఉండాడు. మమ్మల్నందరినీ కలుపుకున్నాడు. రంగంపేట నుంచీ నారావారిపల్లి, కందులవారిపల్లి, శేషాపురం, భీమవరం దాకా జోలి పట్టుకుని తిరిగితే రూ. 5 వేలు వసూలైంది. తక్కువ పడిన మిగతా డబ్బు మేమందరం తలాకొంత వేసుకుని జడ్పీలో కట్టినాం.దాంతో రంగంపేట అప్పర్ ప్రైమరీ స్కూలు హైస్కూలు అయ్యింది.

కోళ్ళ ఫారం డబ్బంతా శీనయ్య మెస్‌కే!

చంద్రబాబుకు చుట్టూ దండిగా స్నేహితులుండాల్సిందే. పీయూసీ రోజుల నుంచీ ఇంతే. స్నేహితుల్లో ఎవరి చేతిలో డబ్బులున్నా అందరం పోలోమని శీనయ్య మెస్సుకు పోయి తినేసేది.డిగ్రీలో చేరినాక ఫ్రెండ్స్ ఇంకా ఎక్కువైనారు. శీనయ్య మెస్సుకు పొయ్యేది కూడా ఎక్కువైంది. అప్పట్లోనే చంద్రబాబు నారావారిపల్లిలో కోళ్ళఫారం పెట్టినాడు. వెయ్యి కోళ్ళు వుండేవి. ఆ కోళ్ళు అమ్మిన డబ్బంతా శీనయ్య మెస్సుకే ఖర్చు పెట్టుంటాడు.

చంద్రగిరి ఓట్ల ఆచారమే మార్చేసినాడు

చంద్రగిరి నియోజకవర్గంలో చంద్రబాబు పోటీ చేయక ముందు దాకా ఎలక్షన్లలో పోటీ చేసిన నాయకులెవురూ ఇండ్లకు పోయి ఓట్లు అడిగిందే లేదు. ఊరికి ఒకరిద్దరు పెద్ద మనుషులుండేవాళ్ళు. వాళ్ళ ఇండ్లకు పోయి మాట్లాడుకోని వెళ్ళిపోయేవారు. ఆ ఊరి పెద్దలు చెప్పినట్టు ఊళ్ళో జనం ఓట్లు వేసేవాళ్ళు. 1978లో చంద్రబాబు ప్రతి ఇంటి గడపా తొక్కి ఓట్లు అడిగినాడు.ఇంటి ముందరకొచ్చి ఓటు అడిగినాడే అని చానా మంది ఆయనకు ఓట్లేసినారు.



కనుమూరి చంద్రశేఖర్ నాయుడు

కందులవారిపల్లికి చెందిన కనుమూరి చంద్రశేఖర్ నాయుడు చంద్రబాబుకు సన్నిహిత బంధువు. బాల్యం నుంచీ కలసి చదువుకున్నారు. శేషాపురంలో 1వ తరగతి నుంచీ 5వ తరగతి వరకూ, తర్వాత తిరుపతిలో పీయూసీ, డిగ్రీ కూడా కలసి చదివారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేసి రిటైరయ్యారు. ప్రస్తుత నివాసం కందులవారిపల్లిలో.

చదివేది ఆ రెండు నెలలే!

డిగ్రీ దాకా చంద్రబాబు యావరేజీ స్టూడెంటే. పీజీలో చేరాక చాలా మార్పు కనిపించింది. చంద్రబాబు చదివేది సంవత్సరంలో రెండు నెలలే. నమ్మినా నమ్మకపోయినా ఇది నిజం. మిగతా టైమంతా తిరిగేదే. స్నేహితులందరం ఒక రూములోనే ఉడ్డగా ఉండేవాళ్లం. డిగ్రీ చదివేటపుడు తిరుపతి పొర్ల వీధిలో ఫ్రెండ్స్‌తో వుండేవాడు.పరీక్షలు దగ్గరికి రాగానే ఆకుతోట వీధిలో ఒక్కడే రూము తీసుకుని అక్కడికి వెళ్ళిపోయేవాడు. పట్టుదలగా చదివి 50 శాతానికి తగ్గకుండా మార్కులు తెచ్చుకునేవాడు.